విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :172 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 7 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాలకు వేళాయే



- ఓట్ల లెక్కింపునకు 365 కేంద్రాలు.. 9,062 కౌంటింగ్ బల్లల ఏర్పాటు
- శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం
- ఏడు పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్: రాష్ట్ర ఎన్నికల సంఘం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఫలితాల వెల్లడికి రాష్ట్రవ్యాప్తంగా 365 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుందని వివరాలు2లో..



ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్

- సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీలో మరో ముందడుగు
- సెమికాన్ 2.0 పోర్టల్ ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్
- రూ.7,500 కోట్లకు పైగా విలువైన 12 ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులకు ఆమోదం
- దేశీయ జీపీయూ చిప్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం

ప్రతి బాధిత రైతునూ ఆదుకుంటాం

- అర్నబ్, మురసుతో తీవ్ర నష్టం
- కోత వేళ మురసు దెబ్బ.. రైతు ఆశలపై నీళ్లు!
- పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా అండ
- చివరి బాధితుడికి సాయం అందేవరకు క్షేత్రస్థాయిలోనే అధికారులు
- దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు చర్యలు



రేటూరు

మంచి దిగుబడితో పంట చేతికొచ్చే సమయంలో మురసు తుపాను రైతుల ఆశలను నీరుగార్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులతో మాట్లాడి, ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అర్నబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతులకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పట్టిసీమ ద్వారా నీరందించి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించామని తెలిపారు. మంచి దిగుబడి వచ్చి పంట చేతికందే సమయంలో మురసు తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తుపాను ప్రభావం ఎక్కువగా వివరాలు2లో..

ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం.. గ్రాప్-3 ఆంక్షలు అమలు

- ఏక్యూఐ 390 దాటడంతో అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధం
- బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ వాహనాలపై ఆంక్షలు
- చిన్నారులకు ఆన్‌లైన్ తరగతులు.. మెట్రో, బస్సు సర్వీసులు పెంపు
- ధంతేరస్ కొనుగోళ్లతో కిక్కిరిసిన రహదారులు





ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి మరో అవకాశం

- ఏపీ, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల ఓటర్లకు ఈసీ వెసులుబాటు
- ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే ఛాన్స్
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను సంప్రదించాలని అధికారులకు ఆదేశాలు
- ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ విమర్శలు.. యూటర్న్ అంటూ జైరాం రమేశ్ వ్యాఖ్యలు

అన్నదాత సహా అందరికీ ముప్పే!



- ఎల్‌నినో దెబ్బ.. అన్నదాత నుంచి సామాన్యుడి వరకు ముప్పే
- వ్యవసాయాన్ని కుదిపేస్తున్న వాతావరణ మార్పులు: క్లైమేట్ ట్రెండ్స్ శ్వేతపత్రం
- ఆహార ధరలు, గృహ బడ్జెట్లు, ద్రవ్యోల్బణంపైనా ప్రభావం
- దేశంలో ఆరు రాష్ట్రాల్లో కరవు ప్రకటన
- ప్రకృతి వ్యవసాయం, కోల్డ్ చైన్ విస్తరణకు నివేదిక సిఫార్సు

న్యూఢిల్లీ

ఎల్‌నినో ప్రభావంతో దేశంలో వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని, వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం పడుతోందని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ హెచ్చరించింది. నీటి ఎద్దడి, పర్యావరణ క్షీణత, సాగు పెట్టుబడుల పెరుగుదలతో వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొంది. ఈ పరిస్థితులు రైతుల జీవనోపాధికే కాకుండా ఆహార ధరలు, కుటుంబాల ఖర్చులు, ద్రవ్యోల్బణంపైనా ప్రభావం చూపనున్నాయని వెల్లడించింది. ఈ అంశాలపై సంస్థ ప్రత్యేక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. ఎల్‌నినో కారణంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు రైతుల ఆదాయాన్ని, జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని శ్వేతపత్రం వివరాలు2లో..



ఓటు హక్కుతో పాటు సంక్షేమ పథకాలకూ ముప్పు

- ఇది ఓట్ల చోరీ కాదు.. పౌరుల హక్కుల చోరీ: రాహుల్ గాంధీ
- ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడీతో పథకాల అమలుపై అభ్యంతరం
- ఎస్ఐఆర్‌తో ఓటర్ల పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆందోళన
- కాలుష్యం, ధరల పెరుగుదలపైనా కేంద్రంపై జైరాం రమేశ్ విమర్శలు


ఏపీలో జలకళ.. జలాశయాల్లోకి కొత్త నీరు



- 505.76 టీఎంసీలకు చేరిన నీటి నిల్వలు
- పూర్తి సామర్థ్యంలో 43.51 శాతం నీరు
- శ్రీశైలంలో ఇంకా తక్కువ నిల్వలు.. భారీ వర్షాల కోసం ఎదురుచూపులు
- ప్రధాన జలాశయాల్లో మిశ్రమంగా నీటిమట్టాలు
- శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో ఇంకా తక్కువగానే నీరు
- రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలు జలాశయాల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. రాష్ట్ర జలవనరుల శాఖ గణాంకాల ప్రకారం ప్రస్తుతం ప్రాజెక్టులన్నింటిలో కలిపి 505.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది మొత్తం జలాశయాల పూర్తి సామర్థ్యం 1,161.36 టీఎంసీల్లో 43.51 శాతానికి సమానం. ఇంకా 655.59 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. నదీ బేసిన్ల వారీగా పరిశీలిస్తే కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో అత్యధికంగా 318.27 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది ఆ బేసిన్ ప్రాజెక్టుల సామర్థ్యంలో 42.47 శాతం. పెన్నా బేసిన్‌లో 107.74 వివరాలు2లో..



శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో అందరికీ ఆహ్వానం

- స్టార్‌లింక్ చివరగా దరఖాస్తు చేసింది: కేంద్రం స్పష్టీకరణ
- భారత్‌లో పోటీకి పూర్తి స్వేచ్ఛ.. వినియోగదారుడే అంతిమ నిర్ణేత
- స్పెక్ట్రమ్ కేటాయింపు, ధరల ఖరారుపై కసరత్తు
- భద్రతా నిబంధనలు పూర్తి చేసిన తర్వాతే వాణిజ్య సేవలు



ఓబీసీ క్రీమీలేయర్‌లో తల్లిదండ్రుల జీతం లెక్కించొద్దు

- కేంద్రం అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- సీఎస్ఈ--2025 అభ్యర్థులకూ మార్చి తీర్పు వర్తింపు
- పాత నియామకాలు, సర్వీసు కేటాయింపులు తిరిగి తెరవాల్సిన అవసరం లేదు
- తీర్పు అమలుకు కేంద్రానికి మరో రెండు నెలల గడువు

ప్రతి బాధిత రైతునూ ఆదుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు.

ముందస్తు హెచ్చరికలను తేలిగ్గా తీసుకోవద్దు

ప్రభుత్వం ముందస్తుగా చేపట్టిన చర్యల వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని చంద్రబాబు తెలిపారు. తుపానులపై హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ముందస్తు జాగ్రత్తతోనే ప్రాణనష్టాన్ని నివారించి, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామని చెప్పారు. సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

40 వేల విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

అర్నబ్ తుపాను కారణంగా నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను ఇప్పటికే పునరుద్ధరించామని సీఎం తెలిపారు. మురసు తుపానుతో దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను కూడా యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నట్లు చెప్పారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తున్నామని వివరించారు.

పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీతో భరోసా

తుపానుల వల్ల జరిగిన నష్టంపై పూర్తిస్థాయి అంచనాలు వేస్తున్నామని, ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఫోన్ చేసి తుపాను ప్రభావంపై వివరాలు అడిగి తెలుసుకున్నారని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చివరి బాధితుడికి సాయం అందే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేస్తారని స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్ సమస్యకు శాశ్వత



పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలకే ప్రాధాన్యం

గత ప్రభుత్వంపై చంద్రబాబు విమర్శలు చేశారు. గత పాలనలో తుపానుల సమయంలో పర్యటనలు, పరామర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యం ఇస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కొందరు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. పరిషత్ ఎన్నికల ఫలితాల తర్వాత అన్ని విషయాలపై మాట్లాడతానని చెప్పారు.

నీటి భద్రతకు ప్రాధాన్యం

తీర ప్రాంతాలను తుపానులు దెబ్బతీస్తుంటే, రాయలసీమ ప్రాంతం ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.

వంద శాతం స్ట్రైక్ రేటు కథ...

కాకినాడ : స్థానిక ఎన్నికల్లో జనసేన మరోసారి సత్తా చూపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేట్ ఎలా అయితే సాధించిందో.. స్థానిక ఎన్నికల్లో కూడా అదే స్థాయి ఫలితాలను మరోసారి రిపీట్ చేసింది. కూటమి ధర్మాన్ని పాటిస్తూ.. టిడిపి.. బిజెపికి సహకరిస్తూ అదరగొట్టింది. కొన్ని ప్రాంతాలలో జనసేన రెబల్ పోటీ చేసిన ఆదోని ప్రాంతంలో మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంది. పోటీ చేసిన అన్ని స్థానాలలో గ్లాస్ అదరగొట్టింది.స్థానిక ఎన్నికల్లో మొత్తం 86 మున్సిపాలిటీలు.. 13 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు జరిగాయి. 13 మున్సిపల్ కార్పొరేషన్లలో 12 చోట్ల కూటమి జయ కేతనం ఎగరవేసింది. 86 మున్సిపాలిటీలలో 83 స్థానాల మీద కూటమి జెండా ఎగరవేసింది. వైసీపీ ఖాతాలో నందికొట్కూరు.. బేతంచెర్ల.. నాయుడుపేట చేరాయి. జనసేన ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు, విజయవాడలో పంగవీటి రాధాకృష్ణ విజయం సాధించారు. రాధా మెజారిటీ కూడా 2 లక్షలు ఉంది. ఈ స్థాయిలో విజయం సాధించి.. తమ కేటాయించిన స్థానాలలో అదరగొట్టారు.అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన తిరుగులేని స్థాయిని చూపించింది. 100% స్ట్రైక్ రేట్ కొనసాగించింది. కూటమి పొత్తు ధర్మాన్ని పాటించింది. ఏ మాత్రం కూడా క్షేత్రస్థాయిలో ఇపరు లేకుండా చూసుకుంది. స్థానిక ఎన్నికల్లో కూడా అదే జోరు చూపించింది. పవన్ కళ్యాణ్ మాటలను శిరోధార్యంగా భావించి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు.. నాయకులు శ్రమించారు. వైసిపి ఎన్ని రకాలుగా విష ప్రచారం చేసినప్పటికీ.. కూటమిలో ఐక్యత లేదని సొంత మీడియాలో రకరకాలుగా వార్తలు పండి వార్చినప్పటికీ అదంతా కూడా కేవలం ఊకదంపుడు ప్రచారమే అని నిరూపించింది. స్థానిక ఎన్నికల్లో.. అంతకుముందు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేట్ సాధించడం అంటే మాటలు కాదు. ఇదంతా కూడా పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధి.. కార్యకర్తల సంకల్పానికి నిదర్శమని చెబుతున్నారు విశ్లేషకులు.. ఇదే జోరు జనసేన భవిష్యత్తులో కూడా కొనసాగిస్తే తిరుగుండదని.. విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.కేవలం కాపు సామాజిక వర్గం బలంగా ఉన్నచోట మాత్రమే జనసేన సత్తా చూపించిందని గతంలో అనేకమంది విమర్శలు చేశారు. అయితే ఈసారి స్థానిక ఎన్నికల్లో ఆ విమర్శలను పటా పంచలు చేసింది జనసేన. అనువు గాని చోట్లలో కూడా అదరగొట్టింది. దీనికి టిడిపి.. బిజెపి ఓటు బ్యాంకు కూడా కలిసి పచ్చింది. తద్వారా జనసేన ఘనవిజయం సాధించింది. 100% స్ట్రైక్ రేట్ అంటే మాటలు కాదు. నేటి పాలిటిక్స్ లో తను సృష్టించిన రికార్డును తాను కొనసాగించడం అంటే అంత ఈజీ కాదు. కానీ దీన్ని



చేతల్లో చేసి చూపించింది జనసేన. వచ్చిన స్థానాలలో విజయం సాధించి.. మిగతా స్థానాలలో టిడిపి విజయానికి కృషి చేసింది.జనసేన మొత్తంగా నాలుగు కార్పొరేషన్లు.. 18 మున్సిపాలిటీలు.. మూడు నగర పంచాయతీలో పోటీ చేసింది. ఎన్నికల జరిగిన రెండు కార్పొరేషన్లు.. 15 మున్సిపాలిటీలు.. మూడు నగర పంచాయతీలను జనసేన గెలుచుకుంది. డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోని రెండు మున్సిపాలిటీలతో సహా ప్రస్తుతం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న అన్నిచోట్ల మున్సిపాలిటీలను పొత్తులో భాగంగా జనసేన తీసుకుంది. కొత్త ప్రాంతాలకు విస్తరించేలాగా మరికొన్ని స్థానాలు కూడా తీసుకుంది. కొత్త నియోజకవర్గాలను పార్టీని విస్తరించినందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకుంది. వైసిపి.. టిడిపి నుంచి వచ్చిన వారికి కూడా కొన్ని చోట్ల అవకాశం కల్పించి.. కొత్త నాయకత్వం విస్తరణకు కృషి చేసింది. 2024 లో జరిగిన శాసనసభ.. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానంలో జనసేన గెలిచింది. ఆ రికార్డును ఈ స్థానిక ఎన్నికల్లో కూడా కొనసాగించింది.. పిఠాపురం.. పాలకొండ.. తెనాలి.. తాడేపల్లిగూడెం.. భీమవరం.. నరసాపురం.. కాకినాడ వంటి ప్రాంతాలలో ప్రజా ప్రతినిధులు ఉన్నప్పటికీ.. అక్కడ మున్సిపల్.. కార్పొరేషన్ ఎన్నికల్లోనూ పొత్తులను స్వీకరించింది. అయితే కాకినాడ.. తాడేపల్లిగూడెం.. భీమవరం ప్రాంతాలలో ఎన్నికలు జరగలేదు. కీలకమైన విజయవాడ నగరంలో మేయర్ స్థానానికి పోటీ చేసి గెలిచింది. ఇక్కడ వంగవీటి రాధాకృష్ణకు అవకాశం కల్పించింది. ఏలూరు కార్పొరేషన్.. శ్రీకాకుళంలో కొత్తగా పార్టీని విస్తరించినందుకు పొత్తులు కుదుర్చుకుంది. తుని.. పెద్దాపురం (సామర్లకోట మున్సిపాలిటీ), దర్శి, తిరువూరు, చిలకలూరిపేట, ముమ్మిడివరం, అమలాపురం, పెడన, మదకశిర, పుట్టపర్తి, నగరి (పుత్తూరు మున్సిపాలిటీ) నియోజకవర్గాలకు పార్టీని విస్తరించే విధంగా కృషి చేసింది. అయితే ఇక్కడ తీసుకున్న స్థానాలలో జనసేన గెలవడం విశేషం.డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం పురపాలకంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. పూర్తిస్థాయిలో మెజారిటీని దక్కించుకున్నారు. అయితే ఇక్కడ 10 వార్డులలో ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించడం విశేషం. వీరిలో కొంతమంది కూటమి రెబల్స్, ఇద్దరు వైసిపి రెబల్స్ ఉన్నారు. జనసేన నుంచి చైర్మన్ అభ్యర్థిగా నిలిచిన దానం లాజర్ తన సమీప ప్రత్యర్థి పెదపాటి రాజేష్ కుమార్ మీద 9235 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ మొత్తం 36 వార్డులు ఉన్నాయి. వీటిలో మూడు గతంలోని జనసేనకు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 33 వార్డులలో జనసేన 16.. టిడిపి ఐదు.. బిజెపి ఒకటి.. ఇండిపెండెంట్ లు 10 వార్డులలో గెలిచారు. కేవలం 19వ వార్డులో మాత్రమే వైసిపి విజయం సాధించింది. ఏకగ్రీవం కలుపుకొని జనసేనకు 25 స్థానాలు లభించాయి.

లోకేష్ పకడ్బందీ వ్యూహం

గుంటూరు : స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ముందస్తు సమయం నుంచి దాదాపు పది రోజుల పాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఎక్కడా బహిరం గంగా కనిపించకపోవడంపై కొద్దిరోజుల క్రితం సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు, చర్చలు సాగాయి. క్షేత్రస్థాయి ప్రచారాల్లో ఆయన కనిపించకపోవడంతో ప్రత్యర్థులు దీనిపై రకరకాల వ్యాఖ్యానాలు చేశారు. అయితే, ఆ నిశ్శబ్దం వెనుక ఎంతటి పకడ్బందీ వ్యూహం దాగి ఉందో తెలిసిన వారికి మాత్రం అది ఆశ్చర్యం కలిగించలేదు. కెమెరాల ముందుకు రాకుండా నారా లోకేష్ రహస్య వార్ రూమ్‌లో కూర్చుని.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఎన్నికల మిషన్‌ను సూక్ష్మస్థాయిలో సిద్ధం చేయడంలోనే ఆ సమయాన్ని పూర్తిగా వెచ్చించారు. ప్రచార ఆర్భాటాల కంటే కూడా ఫలితాలను శాసించే సంస్థాగత ఎలక్షనీరింగ్ వ్యూహాన్ని రూపొందించడమే లక్ష్యంగా ఆయన తెరవెనుక మంత్రాంగం నడిపించారు.సాధారణంగా ఎన్నికలంటే సభలు, రోడ్‌షోలు, మైకుల హోరు మాత్రమే అనుకునే వారికి.. ఆధునిక రాజకీయాల్లో డాటా సైన్స్, క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్ ఎంతటి కీలక పాత్ర పోషిస్తాయో లోకేష్ కార్యాచరణ స్పష్టం చేసింది. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల వారీగా స్థానిక సమీకరణాలను బేరీజు వేస్తూ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీలతో ఎక్కడా విభేదాలు రాకుండా సీట్ల సర్దుబాటు రూట్ మ్యాప్ తయారు చేయడం, బూత్ స్థాయి కమిటీలను అప్రమత్తం చేయడం, ఓటర్ల చేరికలు-జాబితాల పరిశీలన వంటి క్లిష్టమైన ప్రక్రియలను వార్ రూమ్ నుంచే స్వయంగా



పర్యవేక్షించారు. ప్రణాళిక రచన మొదలుకుని అమలు వరకు ప్రతి అడుగూ పక్కాగా సాగిపోయేలా డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానించారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నమోదు చేసిన చారిత్రాత్మక క్లీన్‌స్వీప్ వెనుక లోకేష్ అమలు చేసిన ఈ మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ మధ్య ఎలాంటి గందరగోళం లేకుండా ఓట్ ట్రాన్స్‌ఫర్ విజయవంతంగా జరగడం, జెన్-జీ సహా కొత్త ముఖాలకు టిక్కెట్లు దక్కడం, అసమ్మతి తలెత్తిన చోట తక్షణమే సమన్వయం కుదరడం.. ఇవన్నీ లోకేష్ వార్ రూమ్ వ్యూహాల ఫలితమేనని స్పష్టమవుతోంది. ప్రత్యర్థులు అనవసర రాజకీయ విమర్శలు, వివాదాల్లో మునిగిపోయిన వేళ.. నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ ఎన్నికల యంత్రాంగాన్ని విజయతీరాలకు నడిపించడంలో ఆయన ప్రదర్శించిన వ్యూహాత్మక చాతుర్యం ప్రతిపక్షాలకు కనీసం కోలుకునే అవకాశం కూడా ఇవ్వలేదు.మైకుల ముందు హంగామా చేసే నాయకులు కొందరైతే.. తెరవెనుక ఉండి మొత్తం రాజకీయ ముఖచిత్రాన్ని తిరగరాయగల వ్యూహకర్తలు అరుదుగా ఉంటారు. ఆ కోణంలో చూస్తే కూటమి సాధించిన ఈ అఖండ మున్సిపల్ విజయంలో నారా లోకేష్ నిజమైన సైలెంట్ హీరో గా నిరూపించుకున్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచే పార్టీ ఎన్నికల వ్యూహాలను కార్పొరేట్ స్థాయిలో నడిపిస్తూ వస్తున్న ఆయన.. ఈ స్థానిక పోరులోనూ తనదైన ఎలక్షనీరింగ్ ముద్ర వేసి తిరుగులేని ఫలితాన్ని రాబట్టారు. ప్రచారం లేకపోయినా ఫలితాలే మాట్లాడాలన్నట్లుగా లోకేష్ సాగించిన ఈ నిశ్శబ్ద మిషన్.. భవిష్యత్ ఎన్నికల సమరాలకు కూడా కూటమికి ఒక తిరుగులేని విజయ సమూనాగా నిలిచింది.

ఏపీలో జలకళ.. జలాశయాల్లోకి కొత్త నీరు!

-మొదటిపేజీ తరువాయి

టీఎంసీలు (36.47 శాతం), గోదావరి బేసిన్‌లో 20.51 టీఎంసీలు (76.72 శాతం) నీరు అందుబాటులో ఉంది. ఇతర బేసిన్ల పరిధిలోని ప్రాజెక్టుల్లో కలిపి 58.72 టీఎంసీల నిల్వలు నమోదయ్యాయి.

శ్రీశైలంలో 23.9 శాతమే నీరు

ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. శుక్రవారం నాటి గణాంకాల ప్రకారం శ్రీశైలం డ్యామ్ పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 51.60 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది 23.9 శాతం నిల్వకు సమానం. 885 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గాను ప్రస్తుతం 832 అడుగుల వద్ద నీరు ఉంది. నాగార్జునసాగర్‌లో 180.91 టీఎంసీలు (58 శాతం), పులిచింతలలో 28.19 టీఎంసీలు (61.6 శాతం) నీరు నిల్వ ఉంది. మరోవైపు పెన్నా బేసిన్‌లోని సోమశిలలో 19.74 టీఎంసీలు (25.3 శాతం), కండలేరులో 16.70 టీఎంసీలు (24.6 శాతం) మాత్రమే ఉన్నాయి.

కొన్ని ప్రాజెక్టుల్లో ఆశాజనక నిల్వలు

గండికోటలో 69.5 శాతం, గోరకల్లులో 78.8 శాతం, ఏలేరు జలాశయంలో 91 శాతం నీటి నిల్వలు నమోదయ్యాయి. ఈ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆశాజనకంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ. వర్షపాతం

విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం నవంబర్ 4వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 5వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 10.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాజా వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరుతున్నప్పటికీ, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టుల్లో నిల్వలు గణనీయంగా పెరగాలంటే మరిన్ని భారీ వర్షాలు అవసరమని ప్రస్తుత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాలకు వేళాయే!

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 365 కౌంటింగ్ కేంద్రాల్లో మొత్తం 9,062 కౌంటింగ్ బల్లల ద్వారా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు కమిషనర్ వివరించారు. ప్రతి కౌంటింగ్ బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను అందజేసి లెక్కింపు చేపడతారని తెలిపారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల వెల్లడిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

ఏడు కేంద్రాల్లో రీపోలింగ్ పూర్తి

మరోవైపు బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ పెట్టెల ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఏడు పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం రీపోలింగ్ నిర్వహించారు. అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఆయా కేంద్రాల్లో రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. రీపోలింగ్ పూర్తికావడంతో ఓట్ల లెక్కింపునకు మార్గం సుగమమైంది. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు.

అన్నదాత సహా అందరికీ ముప్పే!



-మొదటిపేజీ తరువాయి

పేర్కొంది. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, కరవు ప్రభావం క్రమంగా పట్టణ ప్రాంతాలపైనా కనిపిస్తోందని తెలిపింది. పొలం నుంచి మార్కెట్ వరకు పంటల సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమవుతోందని వివరించింది. వ్యవసాయ దిగుబడులు తగ్గడం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్ల ఆహార పదార్థాల ధరలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది సామాన్యుల గృహ బడ్జెట్లపై భారం మోపడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుందని విశ్లేషించింది.

ఆరు రాష్ట్రాల్లో కరవు ప్రకటన

ఎల్‌నినో ప్రభావంతో దేశ ఆహార సరఫరా వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని క్లైమేట్ ట్రెండ్స్ తెలిపింది. ఇప్పటికే ఆరు రాష్ట్రాలు కరవును ప్రకటించాయని పేర్కొంది. అయితే ఇతర రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు లేవని దీని అర్థం కాదని స్పష్టం చేసింది. కరవు ప్రకటిస్తే పెట్టుబడులపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో కొన్ని రాష్ట్రాలు అధికారిక ప్రకటనకు వెనుకాడుతున్నాయని నివేదిక అభిప్రాయపడింది.

పంటలు పాడవుతున్నా.. నిల్వ సదుపాయాలు అంతంతే

కరవు కారణంగా భూములు సాగుకు అనుకూలత కోల్పోతే రైతు కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ఇది వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా విస్తృత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. కరవును కేవలం వ్యవసాయ సమస్యగా కాకుండా వ్యవస్థాగత సవాలుగా చూడాలని సూచించింది. దేశంలో పండ్లు, కూరగాయల్లో దాదాపు 40 శాతం వినియోగదారులకు చేరకముందే పాడైపోతున్నాయని వెల్లడించింది. తాజా వ్యవసాయ ఉత్పత్తుల్లో కేవలం నాలుగు శాతానికే కోల్డ్ చైన్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. నిల్వ, రవాణా సౌకర్యాల కొరత కూడా రైతులకు నష్టాలను పెంచుతోందని వివరించింది.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

వ్యవసాయ విధానాలు కేవలం దిగుబడుల పెంపుపైనే కాకుండా నేల ఆరోగ్య పరిరక్షణపైనా దృష్టి సారించాలని క్లైమేట్ ట్రెండ్స్ సూచించింది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పేర్కొంది. చిన్న, సన్నకారు రైతులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని సిఫార్సు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించింది.

నివేదికలోని కీలక సిఫార్సులు

పండ్లు, కూరగాయల నిల్వ కోసం కోల్డ్ చైన్ వ్యవస్థను విస్తరించాలి. ప్రభుత్వాలు ఈ రంగంలో పెట్టుబడులు పెంచాలి. రైతు సమాఖ్యలు, సహకార సంస్థల్లో సంస్కరణలు చేపట్టి పొలం నుంచి మార్కెట్ వరకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ, అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. పంట ఉత్పత్తులను విక్రయించేందుకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలి. కౌలు రైతులతో సహా అర్హులైన రైతులందరినీ పంట, వాతావరణ ఆధారిత బీమా పథకాల పరిధిలోకి తీసుకురావాలి. మండల స్థాయిలో వాతావరణ సలహాలు, కరవు ప్రమాద అంచనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించి, వాటికీ తగిన రాయితీలు కల్పించాలి. వ్యవసాయ బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులు చేయాలి. పంట నష్ట పరిహారాన్ని పొలం పరకే పరిమితం చేయకుండా, ఉత్పత్తి మార్కెట్‌కు చేరే వరకు సరఫరా వ్యవస్థ అంతటా భద్రత కల్పించాలి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ విధానాల్లో సమగ్ర మార్పులు అవసరమని క్లైమేట్ ట్రెండ్స్ శ్వేతపత్రం స్పష్టం చేసింది. రైతుల ఆదాయ భద్రతతో పాటు ఆహార సరఫరా వ్యవస్థను కాపాడేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు చేపట్టాలని సూచించింది.

ఆత్మస్థైర్యంతో కోలుకుంటున్న గోపిక మంత్రి సవిత.





- త్వరలో స్కూల్ కూడా వెళతానంటున్న విద్యార్థిని.
- మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపిన బాధితురాలు.
- బాధిత కుటుంబానికి, విద్యార్థినికి అండగా కూటమి ప్రభుత్వం.
- మహిళలు, బాలికల భద్రతకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం.
- హంతకులకు అండగా జగన్.
- రాప్తాడు నిందితుడికి న్యాయ సహకారం మంత్రి సవిత మండిపాటు.
- బెంగుళూరు మణిపాల్ లో విద్యార్థినికి మంత్రి సవిత పరామర్శ.

బెంగళూరు, నవంబర్ 06 : విద్యార్థిని గోపిక కోలుకుంటోందని, మంత్రి నారా లోకేష్ మంచి వైద్యమందిస్తున్నారని, తాను త్వరలో స్కూల్ కూడా వెళ్లతానని, పదో తరగతి పరీక్షలు కూడా రాస్తానని ఆమె ఎంతో ఆత్మ స్థైర్యంతో చెబుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంత్రి నారా లోకేష్ సొంత బిడ్డ మాదిరిగా గోపిక ఆరోగ్యం పై శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నిందితుడు హేమంత్ ను కాపాడడానికి జగన్ ప్రయత్నిస్తున్నాడని, కూటమి ప్రభుత్వం పై బురదజల్లాలనే ఉద్దేశంతో, ఆయనెప్పుడూ హంతకులను వెంటేసుకుంటా వస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా అదే వారికి చివరి రోజని హెచ్చరించారు. బెంగళూరు లోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక గోపికను మంత్రి సవిత శుక్రవారం పరామర్శించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. గురువారం బాలికకు నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంత మైందని, ప్రస్తుతం గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగు పడుతోందని వైద్యులు తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. దాడికి గురైన విషయం తెలిసిన వెంటనే విద్యార్థినిని అనంతపురం నుంచి బెంగళూరు లోని మణిపాల్ ఆసుపత్రికి గ్రీన్ ఛానల్ ద్వారా వేగంగా తరలించి సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తనకు మెరుగైన వైద్యమందిస్తున్నారని, మంత్రి నారా లోకేష్ కు విద్యార్థిని ధన్యవాదాలు తెలిపినట్లు మంత్రి సవిత సవిత వెల్లడించారు. తాను త్వరలో స్కూల్ కు వెళతానని, పదో తరగతి పరీక్షలు కూడా రాస్తానని విద్యార్థి గోపిక ఎంతో ఆత్మస్థైర్యంతో మాట్లాడుతోందని తెలిపారు. సబాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వ అధికారులు , ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున డాక్టర్ గంగాధర్ రెడ్డి బాలిక వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు తమకు అండగా నిలిచి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ బాలిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారని మంత్రి సవిత వెల్లడించారు. హంతకులకు జగన్ న్యాయ సహకారం: జగన్ రెడ్డి స్వార్థ రాజకీయాలు చేస్తూ, హంతకులను వెంటేస్తుకొస్తున్నారని మంత్రి సవిత మండి పడ్డారు. డ్రైవర్ ను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు తనయుడిని, రాప్తాడులో విద్యార్థిని పై రంపంతో దాడి చేసిన నిందితుడిని జగన్ అండగా నిలుస్తూ వస్తున్నారన్నారు. తన లీగల్ టీమ్ తో రాప్తాడు నిందితుడిని కాపాడడానికి హైకోర్టులో పిల్ వేశారన్నారు. ప్రజల మాన, ప్రాణాలకంటే జగన్ కు హంతకులే ముఖ్యమన్నారు. రాప్తాడు నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. అరెస్టు చేయడానికి వెళ్లిన సమయంలో దాడి చేయడం వల్లే నిందితుడి పై పోలీసులు కాల్పులు జరపారన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా అదే వారికి చివరి రోజని మంత్రి సవిత హెచ్చరించారు. మహిళలు, బాలికల పై ఎక్కడైనా దాడులు జరిగితే ప్రభుత్వం ఉపేక్షించబోదని మంత్రి సవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి ముఠాల పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. విద్యార్థిని కుటుంబానికి భరోసా: అంతకు ముందు ఆసుపత్రికి వెళ్లిన మంత్రి సవిత...విద్యార్థిని కుటుంబ సభ్యులు, వైద్యులతో మాట్లాడారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యమందించాలని సూచించారు. గోపిక త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని మంత్రి సవిత భరోసా ఇచ్చారు.

పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలి.

- ఉదయం 7 గంటలకే అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లు తెరవాలి.
- 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కావాలి.
- ఈ-కౌంటింగ్‌కు అవకాశం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి.
- అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు.



విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 06: విశాఖపట్నం జిల్లాలో పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కౌంటింగ్ ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉదయం 7 గంటలకే అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచి, ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాళ్లలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని, అనధికార వ్యక్తులను అనుమతించకూడదని సూచించారు. ఎవరైనా గొడవలు, అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే తొలుత సముదాయించి నచ్చజెప్పాలని, అప్పటికీ వినకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి టేబుల్‌కు ఇన్‌చార్జిని నియమించాలన్నారు. ఆర్వోలు కౌంటింగ్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వ్యాలిడ్, ఇన్వాలిడ్ ఓట్ల విషయంలో అభ్యర్థులు, ఏజెంట్లకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. ప్రాథమిక లెక్కింపు పూర్తయిన వెంటనే వివరణాత్మక లెక్కింపు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థి వారీగా లెక్కింపు పూర్తయిన వెంటనే సంబంధిత అధికారి సంతకంతో ఫలితాలను వెల్లడించాలని, రీ-కౌంటింగ్‌కు దారితీసే పరిస్థితులు తలెత్తకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. ఫలితాల సమాచారాన్ని మీడియాకు ఎప్పటికప్పుడు అందించాలని, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి సమస్యాత్మక పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారులు, సిబ్బంది బృంద స్ఫూర్తితో పనిచేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఆయా మండలాల రిటర్నింగ్ అధికారులు, లైన్ ఇన్‌చార్జి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రత, ప్రజారోగ్యమే తొలి ప్రాధాన్యం చింతమనేని.

- కూచింపూడిలో డ్రైనేజీ లీకేజీ సమస్యకు తక్షణ పరిష్కారం.
- దగ్గరుండి పనులు చేయించిన ఎమ్మెల్యే చింతమనేని.
- డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయొద్దు.
- స్వచ్ఛ గ్రామాల సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యం చింతమనేని పిలుపు.

దెందులూరు, పెన్ సత్తా, నవంబర్ 06: గ్రామాల సమగ్రాభివృద్ధికి పరిశుభ్ర మైన పరిసరాలు, మెరుగైన ప్రజారోగ్యమే బలమైన పునాదులని, స్వచ్ఛతే ప్రధాన అజెండాగా ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం పెదవేగి మండలంలో పర్యటించిన ఆయన, కూచింపూడి గ్రామంలో ఒక డ్రైనేజీ మ్యాన్ హోల్ నుంచి మురుగునీరు రోడ్డు పైకి ప్రవహిస్తూ ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన విషయాన్ని స్వయంగా గుర్తించారు. పని చిన్నదైనా, పెద్దదైనా ప్రజా సమస్య ఏమాత్రం ఉపేక్షించకూడదన్న సంకల్పంతో ఎమ్మెల్యే చింతమనేని అక్కడికక్కడే రంగం లోకి దిగారు. తక్షణమే జేసీబీ యంత్రాన్ని, పారిశుధ్య కార్మికులను పిలిపించి మ్యాన్‌హోల్ మరమ్మతులు, పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేయించారు. పనులు పూర్తయ్యేంత వరకు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించి, మురుగు రోడ్డు పై చేరకుండా పూర్తి స్థాయిలో సరిచేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతమనేని పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. డ్రైనేజీలు, మ్యాన్‌హోల్స్‌లలో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు తదితర ఘన వ్యర్థాలను విసిరేయడం వల్లే ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రతి పౌరుడూ స్వచ్ఛతను తమ వ్యక్తిగత బాధ్యతగా భావించి సహకరించినప్పుడే గ్రామాలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యకరంగా, ఆదర్శవంతంగా ఎదుగుతాయని స్పష్టం చేశారు. సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అంకితభావానికి కూచింపూడి గ్రామ ప్రజలు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.









పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం మంత్రి సవిత.

ఎస్వీఆర్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను పరిశీలించిన మంత్రి సవిత.







పెనుకొండ, పెన్ సత్తా, నవంబర్ 06: పట్టణం లోని ఎస్వీఆర్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ఎన్టీఆర్ వైద్య సేవలు (ఆరోగ్యశ్రీ) మంజూరైన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరి రక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అర్హులైన పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ప్రజల ఆరోగ్య పరి రక్షణ కోసం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను కూడా అందుబాటు లోకి తీసుకొస్తున్నామని వివరించారు. ప్రజలు ఎన్టీఆర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య చికిత్సలు పొందాలని మంత్రి సవిత సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై మండలాల ఏజెంట్లకు కొణతాల దిశానిర్దేశం.





ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి.

అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 06: గురువారం జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అనకాపల్లి, కశింకోట మండలాలకు చెందిన కూటమి ఎన్నికల లెక్కింపు ఏజెంట్లకు మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెక్కింపు ప్రక్రియలో ఏజెంట్లు అనుసరించాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనల పై ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రతి ఏజెంట్ పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రతి రౌండ్‌లో జరిగే ఓట్ల లెక్కింపును నిశితంగా పరిశీలించాలని, లెక్కింపు వివరాలను జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు తలెత్తినప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి నిబంధనల ప్రకారం తీసుకువెళ్లాలని సూచించారు. ముఖ్యంగా లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి తొందరపాటు, నిర్లక్ష్యానికి తావివ్వకుండా వ్యవహరించాలని ఏజెంట్లకు స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహించాలని కొణతాల రామకృష్ణ గారు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట మండలాలకు చెందిన కూటమి నాయకులు, ఎన్నికల లెక్కింపు ఏజెంట్లు పాల్గొన్నారు.

విశాఖ నార్త్ నూతన కార్పొరేటర్లతో ఎంపీ శ్రీభరత్ భేటీ.



విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 06: ఎంపీ మతుకుమిల్లి శ్రీ భరత్ విశాఖ నార్త్ నియోజకవర్గానికి చెందిన నూతనంగా ఎన్నికైన ఎన్డీఏ కార్పొరేటర్లతో హోటల్ దసపల్లాలో భేటీ అయ్యారు. జీవీఎంసీ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు తమ పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, ప్రజాసేవకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ వంటి కీలక సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఐక్యతే ఈ విజయానికి బలమని, అదే స్ఫూర్తితో విశాఖపట్నం అభివృద్ధికి కలిసి పని చేయాలని పిలుపు నిచ్చారు. నూతన కార్పొరేటర్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో నార్త్ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, బీజేపీ నగర అధ్యక్షుడు పరశు రామరాజు, విశాఖ నార్త్ నియోజకవర్గ ఇన్చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, నూతన మేయర్ ముక్కా శ్రావణి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జీవీఎంసీ నూతన జనసేన కార్పొరేటర్లకు ఘన సన్మానం..

- ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్.
- కూటమి ఐక్యతతో విశాఖ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి పంచకర్ల.
- నూతన కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యేలు.

విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 06: జీవీఎంసీ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన నూతన కార్పొరేటర్లతో పాటు, చివరి వరకు పోరాడి స్వల్ప ఓట్ల తేడాతో విజయాన్ని చేజార్చుకున్న అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తూ ఈరోజు హోటల్ దసపల్లాలో ఆత్మీయ సమావేశం, ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ శివ శంకర్, రూరల్ విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల విజయానికి అహర్నిశలు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విజయం సాధించిన కార్పొరేటర్లతో పాటు, చివరి వరకు ప్రజల్లో ఉంటూ పోరాటం చేసిన ప్రతి ఒక్క అభ్యర్థి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీ విజయానికి సహకరించిన ప్రజలందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల నమ్మకాన్ని బాధ్యతగా స్వీకరించాలి. ఎన్నికల్లో ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా స్వీకరించి, ప్రజాసేవే పరమావధిగా నూతన కార్పొరేటర్లు పనిచేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేక మై, వారి ఆదరాభిమానాలను పొందుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకునేలా పనిచేయాలని ఆకాంక్షించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ విశాఖ అభివృద్ధికి కృషి చేయాలి. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో కూటమి ధర్మాన్ని పాటిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. మూడు పార్టీల ఐక్యత, సమష్టి కృషితో విశాఖ నగర అభివృద్ధికి మరింత వేగంగా పనిచేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనలో భాగస్వాములై నగరాభివృద్ధిలో నూతన కార్పొరేటర్లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం విజయం సాధించిన నూతన కార్పొరేటర్లతో పాటు పోటీ చేసిన అభ్యర్థులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర చైర్మన్ శివ శంకర్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పసుపులేటి ఉషా కిరణ్, పంచకర్ల సందీప్, బెహరా భాస్కర రావు, శివప్రసాద్ రెడ్డి, జీవీఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ వసంతలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ గోవింద రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సతీష్, ఎస్ కే ఎమ్ ఎల్ చైర్మన్ నాగరాజు తదితర నాయకులు, జనసేన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కియా రాకతో పెనుకొండ ప్రాంతం పారిశ్రామికంగా

అభివృద్ధి చెందుతోంది మంత్రి సవిత.

- కియా అనుబంధ పరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు.
- సీహో కియా షోరూం ప్రారంభించిన మంత్రి సవిత.
- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఏస్ఆర్) నిధులతో స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.



పెనుకొండ, పెన్ సత్తా, నవంబర్ 06: గుట్టూరు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీహో కియా కార్ల షోరూమ్ ను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ యాజమాన్యానికి మంత్రి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామిక అభివృద్ధి విజన్‌తో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. కియా పరిశ్రమ రాకతో పెనుకొండ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కియా పరిశ్రమతో పాటు దాని అనుబంధ సంస్థల ద్వారా వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, పెట్టుబడిదారులకు అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని తెలిపారు. గుడిపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పుట్టపర్తి లో ఫైటర్ జెట్ తయారీ వంటి భారీ పరిశ్రమలు వచ్చాయన్నారు. పరిశ్రమలు తమ వ్యాపార కార్యకలాపాలతో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తించాలని మంత్రి సూచించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఏస్ఆర్) నిధుల ద్వారా స్థానిక గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు తోడ్పాటు అందించాలని కియా యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో షో రూమ్ ఎండీ పేరు: హ్యుంగ్‌వూన్ పార్క్, కిమ్ గై సియోంగ్ ,(కియా) హుంజు పార్క్ (ఇంజి టెక్), జోంఘో ర్యూ (కియా ఇండియా నుండి బిజినెస్ హెడ్), ఇతర కంపెనీలు ఎండీ లు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించాలి కలెక్టర్.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 06: నేడు (నవంబర్ 7 న) నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం సాయంత్రం ఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపులో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. బ్యాలెట్ బాక్సులను ఒక గది నుంచి మరొక గదికి తరలించే సమయంలో సంబంధిత ఆర్వో, ఏఆర్వో, పోలీసు అధికారి తప్పనిసరిగా ఉండాలని, ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో చిత్రీకరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండలం లోని కౌంటింగ్ కేంద్రంలో పురుష, మహిళా పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, తగినంత తాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించాలని సూచించారు. పురుషులు, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆర్వోలకు ప్రత్యేక మరుగుదొడ్డి సదుపాయం కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే సిబ్బంది, అధికారుల రవాణా సౌకర్యార్థం బస్సు రూట్లకు అనుగుణంగా తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బస్సుల ఏర్పాట్లను ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు స్వయంగా పరిశీలించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సకాలంలో పూర్తి చేయాలి. కౌంటింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత మైన, నిశ్శబ్ద వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 7 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం 12 గంటలకు భోజనం, సాయంత్రం 6 గంటలకు రాత్రి భోజనం ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో అంతర్గత ఏర్పాట్లను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించాలని సూచించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి, సాయంత్రం 5 గంటల లోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో సంబంధిత అర్వోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఐఐ సదస్సు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన స్పెషల్ సీఎస్ ఎస్.ఎస్. రావత్.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలిసి పరిశీలన.

విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 06: విశాఖపట్నంలో ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ ఏర్పాట్లను స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రాంగణం లే అవుట్ ప్లాన్, ప్రతిపాదిత డిజైన్లు, ప్రధాన ప్రవేశ ద్వారం, రిజిస్ట్రేషన్ బ్లాక్, ల్యాండ్‌స్కేపింగ్, ఫౌంటెన్లు, ఆకర్షణీయ మైన శిల్పాలు, పార్కింగ్ ప్రాంతాలు, బారికేడింగ్, వాహనాల రాకపోకల మార్గాలు, సూచిక బోర్డులు, హోర్డింగులు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు .సదస్సు ప్రాంగణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సుందరీకరణ పనుల వివరాలను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ స్పెషల్ సీఎస్‌కు వివరించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రహదారులు, ఫుట్‌పాత్‌లకు అవసర మైన మరమ్మతులు చేపట్టాలని, ప్రధాన రహదారులు, సదస్సు పరిసర ప్రాంతాలను ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం, పెయింటింగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. అన్ని ఏర్పాట్లను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిఎస్ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఏపీఈడీబీ సీఈఓ సాన్మోహన్, ఏపీఐసీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కుమార్, సీఐఐ నిర్వాహకులు మహేష్ తదితరులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







నోవో ఫోర్ పరిశ్రమ ప్రమాదం పై సమగ్ర విచారణ చేయాలి.

గాయపడ్డ కార్మికుడు కి మెరుగైన వైద్య సేవలు అందించాలి.

ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి డిమాండ్.

పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 06: ఫార్మా సిటీ లో నోవో ఫోర్ ఫార్మా కంపెనీ లో గురువారం బి షిఫ్ట్ లో హెల్పర్గగా పనిచేస్తున్న రాము రియాక్టర్ నుంచి సిఎస్పి పొంగడం వలన ప్రమాదం జరిగినది. ఈ ప్రమాదంలో ఎల్లపు రాము 48 ప్రమాదంలో తీవ్రమైన కాలిన గాయాలు జరిగాయి. యల్లపు రాము (తండ్రి చిన్నబ్బాయి రెడ్డి) వయసు 48 పాటిపల్లి (వి) మునగపాక (మండలం) ప్రస్తుతం ఆరిలోవ హాస్పిటల్ నందు వైద్యం జరుగుతుంది. దీని పై సమగ్రమైన విచారణ చేసి గాయపడ్డ కార్మికుడు కి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రమాదం జరిగిన పరిశ్రమలో వివరాలను సేకరించారు. కార్మికుడు కి కంటికి, శరీరం తీవ్రమైన గాయాలు కావడంతో శుక్రవారం విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి వరకు ఒక ప్రాథమిక వైద్యశాలలో వైద్యం చేయించిన పరిస్థితి. యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకొని భద్రత ప్రమాణాల అమలు జరిగేలా కఠిన మైన చర్యలు చేపట్టాలని గనిశెట్టి



డిమాండ్ చేశారు. జిల్లా అధికారులకు ప్రమాదం సమాచారం కూడా అందజేయకుండా యాజమాన్యం గోప్యంగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. కార్మికుడు కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించడంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించి నష్టపరిహారం చెల్లించాలని యాజమాన్యం మీద క్రిమినల్ చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఘటన పై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు





తిమ్మరాజుపేట యువరైతు అర్జునకు ప్రోత్సాహక రైతుగా సన్మానం.







అచ్యుతాపురం, పెన్ సత్తా, నవంబర్ 06: ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ పరిశోధనా స్థానం అనకాపల్లి, వ్యవసాయ కళాశాల నైరా ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం 2026-27 లో భాగంగా నిర్వహించిన రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనలో తిమ్మరాజుపేట గ్రామ యువరైతు అర్జునను ప్రోత్సాహక రైతుగా సన్మానించారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటిస్తూ, ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకుని, ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఉత్తరాంధ్ర శాస్త్రవేత్తలు ఆయనను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యువత వ్యవసాయం వైపు రావడం, శాస్త్రీయ పద్ధతులతో సాగు చేయడం వల్ల రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. రైతు సదస్సులో వివిధ పంటల సాగు, చీడపీడల నివారణ, నేల ఆరోగ్యం, మార్కెటింగ్ అంశాల పై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ ప్రదర్శనలో నూతన వంగడాలు, యంత్ర పరికరాలు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లాఠీలు, అధికార మదంతో ఎన్నికలను ప్రహసనంగా మార్చిన చంద్రబాబు ప్రభుత్వం:

- **ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి**
- **అనంతపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.**
- **వేలాది వైయస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్ల అపహరణ, అక్రమ కేసులు**
- **మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల హౌస్ అరెస్టులతో ప్రజాస్వామ్యంపై దాడి:**
- **ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం..**
- **కూటమి అరాచక పాలనపై ప్రజల తిరుగుబాటు తప్పదు:**

తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హెచ్చరిక

అనంతపురం పెన్ సత్తా, నవంబర్ 06: : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను అధికార కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా కేవలం పోలీసుల లాఠీలు, అక్రమ నిర్బంధాలతో పూర్తిగా ప్రహసనంగా మార్చేసిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా బలవంతంగా పత్రాలు లాక్కోవడం, వేసిన నామినేషన్లను అధికారులతో కుమ్మక్కై తిరస్కరించడం, పోలింగ్ ఏజెంట్లను, ముఖ్య నాయకులను రాత్రికి రాత్రే పోలీస్ స్టేషన్లలో నిర్బంధించి ఏకపక్షంగా రిగ్గింగ్‌లకు పాల్పడ్డారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలుగుదేశం పార్టీకి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మధ్య జరిగిన ఎన్నిక కాదని, ప్రజల స్వేచ్ఛా హక్కులపై అధికార మదంతో ప్రభుత్వం కాకీ చొక్కాలను అడ్డుపెట్టుకుని చేసిన దాడి అని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఆయన ఏమన్నారంటే...

నామినేషన్ల అపహరణ.. అధికారులతో తిరస్కరణ..

పెద్ద ఎత్తున అభ్యర్థుల చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు బలవంతంగా లాక్కోవడం నీకే చెల్లింది చంద్రబాబూ?. నామినేషన్లను అడ్డుకోవడం ద్వారా మీరు వేలాది స్థానాల్లో ఏకగ్రీవాలు చేసుకుని మీరు అనుకున్న ప్రగతిని సాధించారు. ఇక ధైర్యం చేసి వేసిన నామినేషన్లలో కూడా కనీసం 30 శాతం నామినేషన్లను మీ అనుకూల ఆర్వోలతో స్క్రూటినీలో కావాలని రిజెక్ట్ చేయించారు. వేలాది సంఖ్యలో ఈ విధమైన అక్రమాలకు పాల్పడ్డారు.

అక్రమ కేసులు, బెదిరింపు నోటీసులు.

ఎన్నికల కంటే ముందే వైయస్సార్సీపీ నేతలు, కార్యకర్తలపై అడ్డగోలుగా అక్రమ కేసులు బనాయించారు. ప్రచారాల సందర్భంలోనూ తప్పుడు కేసులు పెట్టి, బైండోవర్లకు కట్టుబడి లేరంటూ ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు, రూ.5 లక్షలు వసూలు చేస్తామని బెదిరింపు నోటీసులు జారీ చేసి భయాందోళనలు సృష్టించారు.

భారీగా ఏజెంట్ల నిర్బంధం.. వందలాది నేతల హౌస్ అరెస్టులు!

ఎన్నికల రోజు ఉదయం 7 గంటలకు పోలింగ్ బూతుల్లో కూర్చోవాల్సిన వేలాది మంది వైయస్సార్సీపీ పోలింగ్ ఏజెంట్లను, గ్రామ స్థాయి ముఖ్య నాయకులను ముందు రోజు రాత్రి నుంచే పోలీసులు అక్రమంగా స్టేషన్లకు తీసుకెళ్లి నిర్బంధించారు. బయట ఉంటే ఓటర్లు ఎక్కడ వారిని చూసి ధైర్యంగా ఓటు వేయడానికి వస్తారేమోనన్న భయంతో వారిని బూతులకు రాకుండా అడ్డుకున్నారు. చివరకు నాలాంటి మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, నియోజకవర్గ సమన్వయకర్తలను సైతం వందల సంఖ్యలో ఇళ్లలోనే హౌస్ అరెస్టులు చేశారు. చంద్రబాబు నీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని పక్కనపెట్టి, నీ కుమారుడు నడుపుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'లో ఇదొక నయా మైలేజ్.

సుప్రీంకోర్టు ఆదేశాల బేఖాతరు.. సీసీటీవీల మాయాజాలం!

ఇవి ఎలక్షన్లా లేక సెలెక్షన్లా? సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విలువ లేదా? నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీటీవీ నిఘా తప్పనిసరిగా ఉండాలని కోర్టు ఆదేశించినా ఎక్కడ పాటించారు? కేవలం 50 శాతం కేంద్రాల్లో మాత్రమే కెమెరాలు పెట్టి, ఆ ఫుటేజ్‌ను కూడా అభ్యర్థులకు ఇవ్వకుండా దాచిపెట్టారు. 7,762 ఎంపీటీసీ, 582 జడ్పీటీసీ స్థానాల్లో ఎన్నికల నిర్వహణపై తీవ్రమైన ఫిర్యాదులు వస్తే ఏ ఒక్క కలెక్టరైనా చర్యలు తీసుకున్నారా?"

పరిటాల సునీత సొంత గడ్డపై దౌర్జన్యాలు.. ఎన్నికల బహిష్కరణ!

రామగిరి మండలం మాజీ మంత్రి పరిటాల సునీత సొంత మండలం, నసనకోట ఆమె సొంత గ్రామం. ఆ మండలంలోని ప్రతి గ్రామంలోనూ వైయస్సార్సీపీ ఏజెంట్లను బలవంతంగా అడ్డుకున్నారు. రామగిరి, కనగాపల్లి మండలాల్లో అధికార పార్టీ అరాచకాలను నిరసిస్తూ ఉదయం 11 గంటలకే దాదాపు ప్రతి ఎంపీటీసీ సెగ్మెంట్‌లో మా అభ్యర్థులు ఎన్నికల ప్రక్రియను బహిష్కరించి బయటకు వచ్చేశారు. స్వయంగా డీఎస్పీ రంగంలోకి దిగి, సీఐలు, ఎస్సైలకు టార్గెట్లు పెట్టి రిగ్గింగ్ చేయించే బాధ్యతలను మోశారు. టీడీపీ గుండాలకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి పోలీసులే స్వయంగా దగ్గరుండి రిగ్గింగ్ చేయించారు.

రెండు గంటల్లో 30 వేల ఓట్లా?.. గిన్నిస్ బుక్ రికార్డు!

పోలీసుల మద్దతుతో ఏకపక్షంగా రిగ్గింగ్ చేసుకుంటూ పోతే ఇక ఎన్నికలు ఎందుకు? కౌంటింగ్ ఎందుకు? ధర్మవరంలో కేవలం రెండు గంటల్లో (ఉదయం 9 నుంచి 11 గంటలకు) 30,000 ఓట్లు ఎలా నమోదయ్యాయి? చిలకలూరిపేటలో రెండు గంటల్లో 20,000 ఓట్లు ఎలా పడ్డాయి? గంటల వ్యవధిలో వేలాది ఓట్లు గుద్దేసిన ఈ విడ్డూరాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పెట్టాలి. విశాఖపట్నంలో సాయంత్రం 5 గంటల వరకు 9,19,367 ఓట్లు పోలైతే, పోలింగ్ ముగిసిన తర్వాత అర్ధరాత్రి 2:30 గంటలకు అదనంగా మరో 1,15,767 ఓట్లు ఎలా పెరిగాయి? చిత్తూరు మున్సిపల్ ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే కౌంటింగ్‌లో 7,000 ఓట్లు అదనంగా వచ్చాయి. పులివెందులలో పెట్రోల్ బాంబుల దాడులు, బ్యాలెట్ బాక్సుల భద్రతపై అనుమానాలు వ్యక్తం చేసినా పట్టించుకోలేదు.

ప్రజలపై ప్రభుత్వ యుద్ధం.. ప్రజాస్వామ్యానికి చీకటి రోజు!

డీజీపీ, ఐజీల నుంచి కింది స్థాయి కానిస్టేబుల్ వరకు, ఎలక్షన్ కమిషనర్, కలెక్టర్ల నుంచి ఎంపీడీవోల వరకు చంద్రబాబు ఆదేశాలతో కేవలం 45 రోజుల్లో ఎన్నికల నిర్వహణలో దొంగ రికార్డులు సృష్టించేందుకు పనిచేశారు. ఇది పార్టీల మధ్య జరిగిన ఎన్నిక కాదు, ప్రజల ఓటు హక్కుపై, స్వేచ్ఛపై అధికార మదంతో ప్రభుత్వమే కాకీ చొక్కాలను పంపి చేసిన దాడి. అంబేద్కర్ రాజ్యాంగానికి, గాంధీజీ గ్రామ స్వరాజ్య కలలకు ఇది అత్యంత క్షోభ కలిగించే దుర్దినం. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వరు, సంక్షేమం అందించరు, సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసి చివరకు ఓటు హక్కును కూడా లాక్కుంటున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే యువతను సైతం నిర్బంధిస్తున్నారు.

ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోంది.. ప్రజల తిరుగుబాటు ఖాయం!

ప్రస్తుతం రాష్ట్రంలో 1975 నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను కూటమి ప్రభుత్వం మరలా తీసుకొచ్చిందని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. లాఠీలు, తూటాల బలంతో ప్రజాస్వామ్యాన్ని తొక్కివేస్తే ప్రజల్లో తిరుగుబాటు రాక మానదని... రెడ్ బుక్ రాజ్యాంగం వల్ల రాష్ట్రంలో ఎవరికైనా పట్టెడు అన్నం దక్కిందా? అని సూటిగా ప్రశ్నించారు. పోటీ జరిగిన ప్రతిచోటా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనే భయంతోనే రాప్తాడుతో సహా అనేక చోట్ల ఆర్వోలను కార్యాలయాలకు రాకుండా చేసి రేపటి కౌంటింగ్‌లోనూ కొత్త కొత్త రూల్స్ తెచ్చి అక్రమాలకు పాల్పడేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలను అణచివేసిన నియంతలకు చరిత్రలో ఎలాంటి దుస్థితి పట్టిందో చంద్రబాబుకు, ఆయన కుమారుడికి అదే గతి పడుతుందని.. ప్రజలు అధఃపాతాళానికి తొక్కడం ఖాయమని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో చంద్రబాబు కొత్త చరిత్ర

అనంతపురం: పెన్ సత్తా, నవంబర్ 06: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో చంద్రబాబు కొత్త చరిత్ర సృష్టించారని అనంతపురం జిల్లా వైయస్ఆర్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడాల్సిన ప్రభుత్వం.. ప్రజలు ఓటు వేయకుండా, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుని ఎన్నికల ప్రక్రియనే నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఎన్నికలను ఇంత దుర్మార్గంగా కూడా నిర్వహించవచ్చని చంద్రబాబు ప్రభుత్వం చేసి చూపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతపురం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై వైయస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైయస్ఆర్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్, మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను అధికార దుర్వినియోగంతో నిర్వీర్యం చేసి, ప్రజల ఓటు హక్కును, అభ్యర్థుల పోటీ హక్కును కాలరాశారని వారు ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థలే అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరమని పేర్కొంటూ, ఎన్నికల పేరుతో చోటుచేసుకున్న పరిణామాలను మీడియా సమావేశంలో ఎండగట్టారు.

మీడియా సమావేశంలో నేతలు ఏమన్నారంటే..

ఎన్నికలు కాదు.. ప్రజాస్వామ్యాన్ని అడ్డుకునే ప్రక్రియ : డాక్టర్ సాకే శైలజనాథ్, మాజీ మంత్రి

ఎన్నికలను ఇంత దుర్మార్గంగా కూడా నిర్వహించవచ్చని చంద్రబాబు చేసి చూపించారు. ప్రజలు ఓటు వేయకుండా, అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం నుంచి పోలింగ్ కేంద్రాల్లో వైయస్ఆర్‌సీపీ ఏజెంట్లను కొట్టి బయటకు పంపడం వరకు ఎన్నికల ప్రక్రియనే నిర్వీర్యం చేశారు. 22 అర్బన్ లోకల్ బాడీల్లో పోటీ లేకుండా చేయడం, 84 జెడ్పీటీసీలు, 2,198 ఎంపీటీసీల్లో పోటీ లేకుండా చేయడం ప్రజాస్వామ్య చరిత్రలోనే చీకటి అధ్యాయం. పోలీసు, రెవెన్యూ అధికారులను ఉపయోగించి ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలను సైతం భయభ్రాంతులకు గురిచేయడం, బైండ్‌ఓవర్ల పేరుతో వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టడం, పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీకి ఒక న్యాయం.. ప్రతిపక్షానికి మరో న్యాయం చేయడం ద్వారా భయానక వాతావరణం సృష్టించారు.

పేదల ఓటు హక్కును కాపాడుకోవాలి.. కాలమే అందరికీ తీర్పు చెబుతుందిఈ పరిస్థితుల్లో పేదలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు తమ ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నికల కౌంటింగ్ సమయంలోనూ వైయస్ఆర్‌సీపీ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు జరిగిన ప్రతి పరిణామాన్ని ప్రజల ముందుంచాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నమ్ముకున్న మనం భయపడాల్సిన అవసరం లేదు. ఎన్నికలను ప్రజలకు దూరం చేసి, వ్యవస్థలను భయపెట్టి, ప్రలోభపెట్టి నడిపించే రాజకీయాలకు కాలమే తీర్పు చెబుతుంది. రాబోయే రోజుల్లో కాలం ఇచ్చే తీర్పుకు అందరూ సిద్ధంగా ఉండాలి.

నూకాంబికకు మహిళలచే సామూహిక ధనలక్ష్మి పూజ.





అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 06: ఉత్తరాంధ్ర ఇలవేల్పు ప్రముఖ పుణ్యక్షేత్రం గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆశ్వీజమాంసం ధన త్రయోదశి శుక్రవారం సందర్భంగా ఆలయ మంటపములో సామూహిక మహిళలచే ధనలక్ష్మి పూజ ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు ధనలక్ష్మి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ బుద్ద మహాలక్ష్మినగేష్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు,యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో వివాహ వేడుకకు హాజరైన శ్రీ వైయస్ జగన్ దంపతులు



పెన్ సత్తా, నవంబర్ 06: నూతన వధూవరులు శ్రేయ--ఉజ్వల్‌లను ఆశీర్వదించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన సతీమణి శ్రీమతి వైయస్ భారతి చెన్నైలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో జరిగిన వైయస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహ వేడుకకు హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులు శ్రేయ--ఉజ్వల్‌లను శ్రీ వైయస్ జగన్ దంపతులు ఆశీర్వదించి, హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకలో శ్రీమతి వైయస్ విజయమ్మతో పాటు వైఎస్సార్సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎన్నికల అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరపాలి

అనంతపురం: పెన్ సత్తా, నవంబర్ 06: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్న పోలీసు వ్యవస్థను కూటమి ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశ్వేశ్వర రెడ్డి మండిపడ్డారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చగా మారిందిని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అనంతపురం జిల్లాలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో వైటఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, బెదిరింపులు, దౌర్జన్యాలతో ఎన్నికలు జరిపించిన మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రజాస్వామ్యం, నేర రాజకీయాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆక్షేపించారు. కేశవ్ తన సొంత గ్రామంలోనే దశాబ్దాలుగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగని పరిస్థితి ఉందని గుర్తు చేశారు. మంత్రి కేశవ్ చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే అబద్ధాలను నిర్భయంగా చెప్పడంలో ఆయనకు ఎవరూ సాటిలేరని ఎద్దేవా చేశారు. అధికార దర్పంతో జరిగిన ప్రతి తప్పునూ సమర్థించుకోవడం ఆయనకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. గత మున్సిపల్ ఎన్నికల నుంచి ప్రస్తుత ఎన్నికల వరకు జరిగిన నామినేషన్ల అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను కేశవ్ గుర్తు చేసుకోవాలని విశ్వేశ్వరరెడ్డి హితవు పలికారు. న్యాయస్థానాలు తీవ్రంగా స్పందించిన అంశాలను పక్కనపెట్టి, రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు నుంచే రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఎస్పీ, డీఐజీ తదితర ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, ఆచరణలో కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెన్నుపోటు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యతను విస్మరించి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను అణచివేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ప్రెస్ మీట్ లో ఆయన ఇంకా ఏం మాట్లాడరంటే...

ఏజెంట్లను నిర్బంధించి ఎన్నికలా..?

ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు. రాత్రి రెండున్నర గంటల సమయంలో కూడా మా నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

టీడీపీలో సివంగులు.. వదల్లేదుగా.. !



తాజా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ మహిళా నేతలు తమ సత్తా చాటారు. కడపలో ఎమ్మెల్యే ఆర్. మాధవి అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు చురుగ్గా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. మంత్రి సవిత అనంతపురం జిల్లాలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేశారు. చంద్రగిరిలో పులవర్తి సుధ పోలింగ్ సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అనుసరిస్తూ వ్యవహరించిన తీరు కూడా చర్చనీయాంశమైంది.

కూటమి పార్టీల్లో కీలకమైన టీడీపీలో మహిళా నేతల దూకుడు మరోసారి చర్చకు వచ్చింది. 2024 ఎన్నికల సమయంలో విజయం దక్కించుకున్న మహిళా నాయకులు.. పార్టీని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు పురుష నేతల కంటే కూడా ఎక్కువగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నించారు. అదేసమయంలో ఏ ఎన్నికలు వచ్చినా.. మేమున్నామని నిరూపిస్తున్నారు. తాజాగా జరిగిన మునిసిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పురుష నేతల ప్రభావం ఒకవైపు ఉన్నా.. మరోవైపు టీడీపీ మహిళా నాయకులు కూడా దూకుడు ప్రదర్శించారు.ఆర్.మాధవి: కడప కార్పొరేషన్ సహా.. తాజాగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను కడప ఎమ్మెల్యేగా ఉన్న రెడ్డప్పగారి మాధవి రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ పార్టీతో పాటు తన హవాను కూడా పెంచుకునేందు కు ఆమె చేసిన ప్రయత్నం ఫలించింది. నియోజకవర్గంపై పట్టును కొనసాగించే క్రమంలో వైసీపీ నేతలకు కౌంటర్‌గా బలమైన అభ్యర్థుల ఎంపిక నుంచి ఆమె ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఫైర్ బ్రాండ్ నాయకురాలు కావడంతో నియోజకవర్గంలో ఆమె మాటే చెల్లుబాటు అయింది. ఇక, ఎన్నికల వేళలో ప్రత్యర్థులను కట్టడి చేసే విషయంలోనూ మాధవి దూకుడుగానే వ్యవహరించారు.సవిత: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సంజీవరెడ్డిగారి సవిత.. ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. కానీ.. ఆమె ఆది నుంచి కూడా.. జిల్లాపై బలమైన ముద్ర వేసే ప్రయత్నం చేశారు. తాజా ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకునే విషయంలో సవిత తనదైన దూకుడు ప్రదర్శించారు. ఫైర్‌బ్రాండ్ నాయకురాలు కాకపోయినా.. వివాదాలకు దూరంగా ఉన్నా.. ప్రజలను ఆకర్షించే విషయంలోను.. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని వివరించి ప్రజల ఓటు బ్యాంకును సానుకూలంగా మార్చుకునే విషయంలోనూ మంత్రి సవిత తనదైన ముద్ర వేసుకుని చాలా మునిసిపాలిటీల్లో క్లీన్‌స్వీప్ చేశారు.పులవర్తి సుధ: పార్టీ పరంగా టీడీపీలో కీలక పోస్టు లేకపోయినా.. చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నానీ సతీమణిగా .. జిల్లాలో పేరు తెచ్చుకున్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తనదైన చాతుర్యంతో కట్టడి చేశారు. రిగ్గింగులు, ఘర్షణలు జరగకుండా.. ఆయనను అనుసరిస్తూ.. జనరల్ ఏజెంట్‌గా వ్యవహరించిన సుధా రెడ్డి, ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో "చెవిరెడ్డి ఎక్కడికి వెళ్తే అక్కడికి తన వాహనంలో వెంబడిస్తానని, ఆయన వెంటే ఉంటానని" హెచ్చరించి రాజకీయంగా సంచలనం సృష్టించారు. ఇలా.. అనేక మంది మహిళా నాయకులు టీడీపీలో విశేషంగా కృషి చేయడం గమనార్హం.

జనం పట్టుబడితే అంతే.. ఏపీలో పోలింగ్ బహిష్కరణ!



ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు పలు గ్రామాల ప్రజలు దూరంగా నిలిచారు. రోడ్లు, తాగునీరు, వైద్యం, విద్య వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదాలపై నిరసనగా సామూహికంగా ఎన్నికలను బహిష్కరించారు. విశాఖ, చిత్తూరు, అనంతపురం, అల్లూరి, తిరుపతి, అనకాపల్లి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఈ నిరసనలు కనిపించాయి. కొన్ని చోట్ల గ్రామంలోని ఓటర్లంతా ఓటింగ్‌కు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

అధికార కూటమి, సహా ఇతర పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్రంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యల కారణంగా బహిష్కరిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రాంతాల్లో కనీస సౌకర్యాల లేమి, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదం, తారు రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఓటర్లు పోలింగ్ ప్రక్రియకు దూరంగా నిలిచారు.

ఎక్కడెక్కడ?

1) విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం రాయనిపేట గ్రామంలోని చెరువు కాలుష్య సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్ల తరబడి శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఇక్కడి ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న మొత్తం 120 ఓట్లకు గాను ఓటర్లందరూ ఏకగ్రీవంగా ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు.

2) చిత్తూరు జిల్లాలోని ఐరాల మండలం అబ్బుగుండు గ్రామానికి కనీస రహదారి సౌకర్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రం వంటి కనీస వసతులు కల్పించలేదని నిరసిస్తూ ఇక్కడి ప్రజలు ఓటింగ్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారు. వాటిపై హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

3) అనంతపురం జిల్లాలోని నెరమెట్ల గ్రామంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈ గ్రామానికి చెందిన ప్రజలు కూడా ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరిస్తూ సామూహిక నిర్ణయం తీసుకున్నారు. రహదారులు, తాగునీటి సౌకర్యం, ఉపాధి కల్పన వంటివాటిని పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

4) అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం, గన్నేరు పుట్టు పంచాయితీ, గొప్పు గరువు, పొర్లు గ్రామాల గిరిజనులు సరైన రోడ్డు సౌకర్యం లేదని, జబ్బులు జ్వరాలు వస్తే ప్రాణాలు పోతున్నాయని, వైద్యం, విద్యా, రవాణా లేకా అవస్తలు పడుతున్న ప్రభుత్వం,అధికారులు ,ప్రజా ప్రతినిధులు పట్టించు కోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తమ ప్రాంతానికి తారు రోడ్డు మంజూరు అయ్యేంత వరకు ఎన్నిక ల్లో పాల్గొన బోమని, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు బహిష్కరిస్తునట్లు ప్రకటించారు.

5) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం మామిడిగుంట ఎస్సీ కాలనీ ఓటర్లు ఎప్పటి నుంచో సమీపంలోనే ఉన్న పిల్లమేడు కేంద్రంలో ఓటు వేస్తున్నారు. అయితే.. ఈసారి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న దయనేడు కేంద్రానికి మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. అంత దూరం వెళ్లలేమంటూ.. పోలింగ్‌ను బహిష్కరించారు.

6) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని వినాయకపురం గ్రామం: దాదాపు 40 ఏళ్లుగా కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాన్ని అకస్మాత్తుగా మార్చడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు స్వచ్ఛందంగా పోలింగ్ ప్రక్రియకు దూరంగా ఉండిపోయారు.

7) అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలంలోని రొంగలివానిపాలెం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్‌ను తొలుత బీసీకి కేటాయించి, ఆ తర్వాత మార్పులు చేయడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల మార్పును వ్యతిరేకిస్తూ గ్రామంలోని సుమారు 800 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనకుండా బహిష్కరించారు.

'గ్రేటర్' విశాఖలో జనసేన సునామీ... !



గ్రేటర్ విశాఖలో జనసేన తన బలాన్ని గణనీయంగా పెంచుకుంది. 2021 స్థానిక ఎన్నికల్లో 58 వార్డులకు పోటీ చేసి కేవలం 3 స్థానాలే గెలిచిన పార్టీ.. తాజా మున్సిపల్ ఎన్నికల్లో 32 వార్డుల్లో పోటీ చేసి 25 చోట్ల విజయం సాధించింది. దక్షిణ విశాఖ, అనకాపల్లి, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో మంచి ఫలితాలు సాధించింది. ఈ విజయంతో ఉత్తరాంధ్రలో పార్టీ విస్తరణకు మరింత ఊతం లభించనుందని జనసేన నేతలు భావిస్తున్నారు.

గ్రేటర్ విశాఖపట్నంలో జనసేన సునామీ సృష్టించింది. నిజానికి ఉత్తరాంధ్రపై కూటమి పట్టుబిగించింది. దీనిలో నూ జనసేన గత 2019 ఎన్నికలతో పోల్చుకుంటే.. ఇప్పుడు మరింతగా విశాఖపై పట్టు పెంచుకోవడం గమనార్హం. అప్పట్లో పవన్ గాజువాక నుంచి ఓడిపోయిన దరిమిలా.. పార్టీ పుంజుకునే విషయంపై చర్చసాగింది. పైగా అదే ఎన్నికల్లో జనసేన విశాఖ నుంచి పోటీ చేసి కూడా.. పరాజయం పాలైంది. దీంతో గ్రేటర్ విశాఖలో గ్లాసు పరిస్థితి సమస్యగా మారింది. కానీ.. అక్కడే ఇప్పుడు పార్టీ పుంజుకోవడం గమనార్హం.

వాస్తవానికి జనసేన 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ పెద్దగా పోటీ ఇవ్వలేక పోయింది. అప్పట్లో పవన్ కల్యాణ్ పోటీ చేసేవారు చేసుకోండి అనిపిలుపునిచ్చి వదిలేశారు. దీంత 58 వార్డుల్లో జనసేన నాయకులు పోటీ చేయగా.. కేవలం ముగ్గురంటే ముగ్గురు నాయకులు మాత్రమే గెలిచారు. కానీ.. దీనికి భిన్నంగా 2024 ఎన్నికల నుంచి కూడా జనసేన విశాఖలో పుంజుకోవడం ప్రారంభించింది. ఒక ఎమ్మెల్యే స్థానంతో పాటు తాజాగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లోనూ జనసేన దూకుడు చూపింది.ప్రస్తుతం మిత్రపక్షాల తరపున 32 వార్డుల్లో పోటీ చేసింది. అయితే.. కొన్ని కొన్ని మినహా అన్ని చోట్లా జనసేన విజయం దక్కించుకుంది. ఇది ఆ పార్టీకి మంచి ఊపును తెచ్చే వ్యవహారంగానే నాయకులు చెబుతున్నారు. అంతేకాదు.. భవిష్యత్తులోనూ ఉత్తరాంధ్రకు కీలకమైన గ్రేటర్ విశాఖలో పార్టీ పుంజుకునేందుకు.. మరింతగా పార్టీ విస్తరించేందుకు కూడా ఇది దోహద పడుతుందని అంటున్నారు. పైగా ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖలో పార్టీ పుంజుకోవడం ద్వారా.. అధికారంలోకి రావడం కూడా సునాయాసం అవుతుందని లెక్కలు వేస్తున్నారు.

ఎక్కడెక్కడ గెలిచారంటే..

1) విశాఖ దక్షిణంలో 8 వార్డుల్లో పోటీ చేసి 1 వార్డు మినహా మిగిలిన 7 గెలుచుకున్నారు.

2) గాజువాకలో 6 వార్డుల్లో పోటీ చేయగా, 4 చోట్ల విజయం సాధించింది.

3) అనకాపల్లి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేయగా, మూడింటిలో గెలిచింది.

4) భీమిలి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేసి రెండింటిలో గెలిచారు.

5) పెందుర్తి పరిధిలో రెండు చోట్ల పోటీ చేసిన రెండూ సొంతం చేసుకున్నారు.

6) విశాఖ తూర్పులో 4 చోట్ల పోటీ చేసి రెండు గెలిచారు.

7) పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మూడు వార్డుల్లో పోటీ చేసి 3 కైవసం చేసుకున్నారు.

8) ఉత్తర నియోజకవర్గంలో 3 వార్డులు కేటాయించగా ఒకటి మినహా మిగిలిన 2 చోట్ల గెలిచారు.

'రాధా-రంగా' మిత్రమండలికి జోష్.. !



విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు 2,65,968 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. మొత్తం 86 డివిజన్లలో కూటమి 76 స్థానాలు గెలుచుకుంది. రాధా పుట్టినరోజునే ఫలితం రావడంతో రాధా-రంగా మిత్రమండలి అభిమానుల్లో సంబరాలు నెలకొన్నాయి.

విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణ (వంగవీటి రాధా) రికార్డు స్థాయి మెజారిటీతో మేయర్‌గా ఘనవిజయం సాధించడంతో రాధా-రంగా మిత్రమండలి లో పండగ వాతావరణం నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత వంగవీటి కుటుంబానికి లభించిన ఈ భారీ విజయం రంగా రాజకీయ వారసత్వాన్ని విజయవాడలో తిరిగి బలంగా నిలబెట్టిందని అభిమానులు మురిసిపోతున్నారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన వంగవీటి రాధాకృష్ణ.. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మిపై 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయకేతనం ఎగురవేశారు. రాధాకృష్ణకు మొత్తం 2,65,968 ఓట్లు రాగా, రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. ఇక, నవంబర్ 4న ఓట్ల లెక్కింపు పూర్తి కావడం, అదే రోజు వంగవీటి రాధాకృష్ణ పుట్టినరోజు కావడంతో అభిమానుల ఆనందం రెట్టింపయింది. కేవలం మేయర్ స్థానమే కాకుండా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మొత్తం 86 డివిజన్లలో కూటమి ఏకంగా 76 స్థానాలను కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. గత అక్టోబర్‌లో వంగవీటి రాధాకృష్ణతో పాటు రాధా-రంగా మిత్రమండలి సభ్యులు అధికారికంగా జనసేన పార్టీలో చేరారు.ఇప్పుడు సాధించిన ఈ ఘనవిజయంతో రాధా-రంగా మిత్రమండలి బెజవాడ రాజకీయాల్లో తమ పట్టును చాటుకుంది. పాతికేళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణ ప్రస్తుతం 47 ఏళ్ల వయసులో విజయవాడ మేయర్‌గా ఎన్నికయ్యారు. మరీ ముఖ్యంగా వంగవీటి మోహనరంగా 1985లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలవగా.. రంగా హత్యానంతరం 1989లో జరిగిన ఎన్నికల్లో ఆయన భార్య రత్నకుమారి అదే పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తండ్రి కార్పొరేటర్‌గా..

వంగవీటి మోహనరంగా 1985లో ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచారు అయితే అంతకుముందు 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన కృష్ణలంక 40వ డివిజన్లో కార్పొరేటర్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. ఇప్పుడు ఆయన కుమారుడు రాధా విజయవాడ నగరానికి మేయరుగా ఎన్నికకావడం గమనార్హం. ఇక, ఈ పరిణామంతో ఈ కుటుంబానికి అత్యంత కీలకమైన రాధా-రంగా మిత్రమండలి పుంజుకుంటుందని అనడంలో సందేహం. ఈ మిత్ర మండలి.. సేవా కార్యక్రమాలతోపాటు.. రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు ఉంది.

ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్

విజయవాడ, నవంబర్ 6, :

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాజుజ సిద్ధమవుతోంది. ఇప్పటికే మేయర్, ఛైర్‌పర్సన్, డిజవిన్లు, వార్డులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ నెల10 నుంచి 12 మధ్య ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నెల 25లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ హైకోర్టులో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి కేసులు పెండింగ్ ఉన్నాయి. అందుకే అక్టోబర్ 14న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రస్తావన లేదు.ఏపీ హైకోర్టులో కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డివిజన్లు/వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల తయారీ పూర్తి చేశారు. అలాగే మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఇటీవల రిజర్వేషన్లు కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించింది. కార్పొరేషన్లలో మేయర్ పదవులకు సంబంధించి.. శ్రీకాకుళం (జనరల్ మహిళ), రాజమహేంద్రవరం (ఎస్సీ జనరల్), కాకినాడ(బీసీ మహిళ),మంగళగిరి-తాడేపల్లి (ఎస్టీ జనరల్)కి రిజర్వ్ అయ్యాయి.ఈ నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 260 డివిజన్లలో 90 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేశారు. ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, మహిళలకు 68, అన్ రిజర్వ్‌డ్ కింద 62 ఉన్నాయి. ఆముదాలవలస, రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి, పాలకొల్లు, తణుకు, బి.కొత్తపేట, గుడివాడ, నరసరావుపేట, పొన్నూరు, తాడిగడప, బాపట్ల,పొదిలి, కందుకూరు, అల్లూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. వీటిలోని 749 వార్డులకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వార్డుల్లో బీసీలకు 231, జనరల్ మహిళకు 202, ఎస్సీలకు 106,ఎస్టీలకు 36, రిజర్వ్ అయ్యాయి. మిగిలిన వార్డులు 174 వార్డులు అన్ రిజర్వ్‌డ్ అయ్యాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలో పూర్తికానున్నాయి. అయితే మధ్యలో సుప్రీం కోర్టు తీర్పు, తుఫాన్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురైనా సరే ప్రక్రియ సాఫీగానే సాగిపోయింది.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...

నెల్లూరు, నవంబర్ 6, :

రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్‌పై పట్టు సాధించారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మేయర్‌గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి పై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి.నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి , పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పార్టీకి అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్ యాదవ్‌తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం , వెంకటగిరి , సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించడం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం, పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంపాదకీయం

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు టెక్నాలజీ రంగంలో వాతావరణాన్ని మార్చేశాయి. డెమొక్రాట్లు ప్రతినిధుల సభను, సెనేట్‌ను రెండింటినీ గెలుచుకున్నారు. ఫలితాలను "పూర్తిగా అంగీకరిస్తానని" అధ్యక్షుడు ట్రంప్ న్యూయార్క్ టైమ్స్‌తో అన్నారు. కొత్త కాంగ్రెస్ జనవరిలో బాధ్యతలు చేపడుతుంది. ఈ మార్పు భారత ఐటీ రంగం, ఉద్యోగుల కళ్లకు ఎందుకు పెద్ద విషయమంటే, ట్రంప్ పాలనలో గడిచిన రెండేళ్లు వారికి కష్టంగా గడిచాయి. 2025 సెప్టెంబర్‌లో కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తుపై ఒక లక్ష డాలర్ల రుసుము విధించడంతో 'నిఫ్టీ ఐటీ' సూచీ ఒక్కరోజే సుమారు 4 శాతం పడిపోయింది; హెచ్-1బీ పొందేవారిలో 71 శాతం భారతీయులే, భారత ఐటీ పరిశ్రమ ఆదాయంలో 57 శాతం అమెరికా నుంచే వస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న ట్రంప్ సంతకం చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు, ఇటీవల ఉద్యోగులను తొలగించిన కంపెనీల వీసా దరఖాస్తులను మరింత కఠినంగా పరిశీలించాలని ఏజెన్సీలను ఆదేశించింది. తాజాగా అక్టోబర్ 8న అమెరికా కార్మిక శాఖ, గ్రీన్ కార్డ్ ప్రక్రియలో తొలి మెట్టయిన 'పెర్మ్' (శాశ్వత కార్మిక ధృవీకరణ) కార్యక్రమం నుంచి టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీ, అలాగే మైక్రోసాఫ్ట్, అడోబ్‌లను సస్పెండ్ చేసింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, కార్మిక మంత్రి కీత్ సొండర్లింగ్ పాల్గొన్న శ్వేత సౌధ విలేకరుల సమావేశంలో ప్రకటించిన ఈ చర్యకు ముగింపు తేదీ లేదు, లిఖితపూర్వక నోటీసు కూడా లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు; ఈ కంపెనీల కొత్త దరఖాస్తులను తీసుకోరు, ఇప్పటికే దాఖలైన వాటి పరిశీలన నిలిచిపోయింది. వీసా ప్రాసెసింగ్‌లో ఆలస్యాలు, గ్రీన్ కార్డ్ దరఖాస్తుదారులను స్వదేశాల నుంచే దరఖాస్తు చేయమనే ఒత్తిళ్లు కూడా పెరిగాయి. వీసా సమస్యలు, ఉద్యోగ కోతల కారణంగా గత రెండేళ్లలో 30,000 మందికి పైగా భారతీయ నిపుణులు అమెరికా నుంచి తిరిగివచ్చారని నివేదికలు పేర్కొంటున్నాయి.

ఇందులో ఒక ముఖ్యమైన సవరణ ఏమంటే.. లక్ష డాలర్ల రుసుము ఇప్పుడు వసూలు కావడం లేదు. జూన్ 8న మసాచుసెట్స్ ఫెడరల్ కోర్టు దాన్ని చెల్లని "పన్ను"గా కొట్టేసింది; జులై 24న అప్పీళ్ల కోర్టు (ఫస్ట్ సర్క్యూట్) ఆ తీర్పును నిలిపివేయడానికి నిరాకరించింది; సెప్టెంబర్ 30న కాలిఫోర్నియా కోర్టు కూడా దాని అమలు విధానాలను అడ్డుకుంది. అయితే ప్రభుత్వం అప్పీల్ చేసింది, ట్రంప్ సెప్టెంబర్ 18న ఆ రుసుమును 2027 సెప్టెంబర్ వరకు పొడిగించారు. వేరే కోర్టు గతంలో ఆ రుసుమును సమర్థించింది. కాబట్టి అది ఇంకా పూర్తిగా పోలేదు, న్యాయపోరాటం కొనసాగుతోంది.

ఇప్పుడు డెమొక్రాట్లు కాంగ్రెస్‌ను నియంత్రిస్తే ఏం జరుగుతుంది? చాలామంది నిపుణులు రాబోయే నెలల్లో వీసా ఆంక్షలు సడలుతాయని భావిస్తున్నారు. కాంగ్రెస్ వ్యతిరేకత ఉన్నప్పుడు కొత్త కఠిన చర్యలను అమలు చేయడం కూడా కష్టమవుతుంది. ఇది భారత ఐటీ రంగానికి శుభవార్తే. కానీ అతి ఆశాభావం తగదు. మొదటిది, కొత్త కాంగ్రెస్ జనవరిలో బాధ్యతలు చేపడుతుంది, అంతవరకు పాత సమీకరణాలే కొనసాగుతాయి. రెండోది, ఈ ఆంక్షల్లో చాలా భాగం చట్టాల ద్వారా కాదు, అధ్యక్ష


ఐటీకి ఊరట దక్కేనా?

ప్రకటనలు, కార్యనిర్వాహక ఉత్తర్వులు, శాఖల నిర్ణయాల ద్వారా వచ్చాయి; వాటిని కాంగ్రెస్ ఒక్క రోజులో రద్దు చేయలేదు. ఎన్నికలకు ముందే ట్రంప్ తాను "మిస్టర్ వీటో"గా మారతానని అన్నారు; ఫలితాల తర్వాత డెమొక్రాట్లతో "బహుశా కలిసి పనిచేస్తాను" అన్నారు. కాబట్టి సడలింపు కోర్టుల తీర్పులు, చర్చలు, రాజీల ద్వారా వస్తుందే తప్ప ఒక్కసారిగా కాదు. మూడోది, డెమొక్రాట్లు పూర్తిగా హెచ్-1బీ అనుకూలురు కాదు; ఇటీవల రష్యా ఆంక్షల చట్టానికి 58మంది డెమొక్రాట్లు ఓటేసినట్టే, అమెరికన్ ఉద్యోగాల రక్షణ, అవుట్‌సోర్సింగ్ కంపెనీల దుర్వినియోగంపై చర్యలకు ఆ పార్టీలోనూ మద్దతు ఉంది. నైపుణ్యం గల వలసలకు మద్దతు ఇస్తూనే, ఐటీ అవుట్‌సోర్సింగ్ సంస్థలపై ఒత్తిడి కొనసాగే అవకాశం ఉంది. నాలుగోది, 'పెర్మ్' సస్పెన్షన్ ప్రభుత్వం చెప్పే మోసం, ఉల్లంఘనల దర్యాప్తులతో ముడిపడి ఉంది; ఈ ఆరోపణలను కంపెనీలు తమ స్థాయిలో ఎదుర్కొని, నిబంధనల పాటింపును నిరూపించుకోవాలి.

కృత్రిమ మేధ (ఏఐ) ఈ చర్చలో మరో కోణం. ఏఐ వల్ల అమెరికాలో లక్షలాది ఉద్యోగులు ఉపాధి కోల్పోయినా, ట్రంప్ ప్రభుత్వం ఏఐ అపరిమిత వృద్ధికి మద్దతిచ్చింది తప్ప ఏమీ చేయలేదు. డెమొక్రాట్ల కాంగ్రెస్ ఏఐపై కొన్ని నియంత్రణలు తేవచ్చు. అది భారత ఐటీకి కలిసి రావచ్చు. ప్రస్తుతం పెద్ద భారత ఐటీ కంపెనీల ఆదాయంలో ఏఐ వాటా సుమారు 5-6 శాతం మాత్రమే; ఏఐ వల్ల ధరలపై ఒత్తిడి ఎక్కువగా ఉండి ఆదాయ వృద్ధి మందగించిందని, ఏఐ అనుసరణ వేగం తగ్గితే ఆ కంపెనీలు సర్దుబాటు చేసుకోవడానికి ఎక్కువ సమయం దొరుకుతుందని, ఆదాయ క్షీణత తగ్గి, ఆపరేటింగ్ మార్జిన్లు కాపాడబడతాయని అర్థం చేసుకోవచ్చు. ఇటీవలి త్రైమాసికాల్లో టెక్ స్టార్టప్‌లు, భారత ఐటీ కంపెనీలు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లలో ఉద్యోగ కల్పన మందగించింది; ఇందుకు ప్రధాన కారణం ఏఐ ఆటోమేషన్‌గా భావిస్తున్నారు. అమెరికా నుంచి నైపుణ్యం గల నిపుణులు తిరిగి వస్తుండటంతో ఐటీ ఉద్యోగ మార్కెట్ తీవ్ర పోటీగా మారింది; ఈ ధోరణి తగ్గితే ఉద్యోగులకు మేలు. అయితే ఇక్కడ జాగ్రత్త అవసరం: ఏఐ నియంత్రణలపై ఆశ ఒక ఊహ మాత్రమే; డెమొక్రాట్లు నియంత్రణలు తెస్తారన్న హామీ లేదు, తెచ్చినా ఏఐ వాడకం ఆగదు. కాబట్టి ఇది ఆశించదగినదే కానీ నమ్ముకునే వ్యూహం కాదు.

భారత ఐటీ కంపెనీలు ఇప్పటికే అమెరికాలో స్థానిక నియామకాలు, నియర్‌షోరింగ్, ఏఐ నైపుణ్యాల పెంపు వైపు వెళ్తున్నాయి; అదే దారి కొనసాగించాలి. ప్రభుత్వం భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంలో నిపుణుల రాకపోకలకు ప్రాధాన్యం ఇచ్చి, కాంగ్రెస్‌లో భారత మద్దతును బలోపేతం చేసుకోవాలి. ఉద్యోగులు కొత్త నైపుణ్యాలతో సిద్ధం కావాలి. మన తెలుగు రాష్ట్రాల్లోని చాలా కుటుంబాలకు, అమెరికాలో ఉన్నవారికి, వెళ్లాలనుకునేవారికి, తిరిగి వచ్చినవారికి ఇది నేరుగా సంబంధించిన విషయం. హెచ్-1బీ మార్గంలో అమెరికా వెళ్లిన ఎందరో భారతీయులు అక్కడ గొప్ప విజయాలు సాధించారు; ఆంక్షలు సడలితే "అమెరికా కల" మళ్లీ రెక్కలు తొడగవచ్చు. అది ఎంత త్వరగా, ఎంతవరకు జరుగుతుందన్నది ఎన్నికల ఫలితాలపై కాదు, రాబోయే నెలల్లో కోర్టులు, వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

పనికొచ్చే పలుకు



నిబద్ధత...: సక్సెస్ వెపన్!

జీవితంలో విజయం సాధించాలంటే ఏదోక ప్రత్యేకమైన ప్రతిభ ఉండాలనుకుంటారు చాలామంది. నిజానికి విజయానికి అది తప్పనిసరి అర్హత కాదు. ఎందుకంటే ప్రతిభవున్న ప్రతి ఒక్కరూ విజేత కాలేరు. కానీ సాధారణమైన లక్షణాలను అసాధారణమైన క్రమశిక్షణతో ఆచరించేవారు కచ్చితంగా గమ్యానికి చేరతారు. చిన్న ఎగ్జాంపుల్ తీసుకుందాం. ఇద్దరు వ్యక్తులు ఒకే సమయంలో వ్యాపారం ప్రారంభించారు. ఇద్దరికీ దాదాపు ఒకే పెట్టుబడి, ఒకే రకమైన అవకాశాలు, ఒకే మార్కెట్ పరిజ్ఞానం ఉన్నాయి. మొదటి వ్యక్తి ప్రతిరోజూ కొత్త ఆలోచనలతో ఉత్సాహంగా పనిచేస్తాడు. కానీ కొద్దిరోజులకే ఆసక్తి తగ్గింది. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోతే నిరుత్సాహపడతాడు. రెండో వ్యక్తి మాత్రం -ప్రతిరోజూ నిర్ణీత సమయంలో పని మొదలుపెడతాడు. ఎదురైన సమస్యలను పరిష్కరించుకుంటాడు. నష్టాలనుంచి నేర్చుకుంటాడు. చిన్న విజయాలను ఆస్వాదిస్తూనే ప్రయత్నాన్ని కొనసాగిస్తాడు. కొంతకాలానికి వీరిద్దరి మధ్య స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది. మొదటి వ్యక్తి దగ్గర ఆలోచనలుంటే, రెండో వ్యక్తి దగ్గర అనుభవం, ఫలితాలు, ఎదుగుదల కనిపిస్తాయి. ఇద్దరి మధ్య తేడా ప్రతిభ కాదు.. పనిపట్ల నిబద్ధత!

విజయానికి అవసరమైన మొదటి లక్షణం నిలకడ. ఏ పనినైనా ఒకరోజు ఉత్సాహంగా చేయడం గొప్ప విషయం కాదు. ఆసక్తి తగ్గిన రోజుల్లోనూ అదే పనిని కొనసాగించడం అసలైన గొప్పతనం. వ్యాయామం చేయాలనుకున్నప్పుడు మొదటిరోజు గంటసేపు చేయడం కంటే, ప్రతిరోజూ ఇరవై నిమిషాలు క్రమం తప్పకుండా చేయడం ఎక్కువ ప్రయోజనాన్నిస్తుంది. చదువు, ఉద్యోగం, వ్యాపారం, ఆరోగ్యం.. ఏ విషయంలోనైనా నిలకడే అలవాటును నిర్మిస్తుంది. అలవాటే చివరకు మన వ్యక్తిత్వాన్ని మార్చుతుంది. రెండో లక్షణం -పట్టుదల. మనం అనుకున్నది వెంటనే జరగాలని ఆశించడం సహజం. కానీ జీవితంలో ప్రతి ప్రయత్నానికీ తక్షణ ఫలితం రాదు. కొన్నిసార్లు ఎంత కష్టపడినా పరిస్థితులు అనుకూలించవు. అలాంటప్పుడు లక్ష్యాన్ని వదిలేయడం పరిష్కారం కాదు. అవసరమైతే పద్ధతిని మార్చుకోవాలి. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. ఓటమిని మన సామర్థ్యానికి ఇచ్చిన తీర్పుగా కాకుండా, మన ప్రయాణంలో ఎదురైన అనుభవంగా చూడాలి.

మూడో లక్షణం కష్టపడటానికి సిద్ధంగా ఉండడం. చాలామందికి విజయం కావాలి. కానీ దాని కోసం చెల్లించాల్సిన శ్రమను భరించడానికి మాత్రం ఇష్టపడరు. సౌకర్యాలను వదులుకోవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, అవసరం లేని అలవాట్లను తగ్గించుకోవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం.. ఇవన్నీ కష్టంలో భాగమే. మనం ప్రతిరోజూ చేసే చిన్న చిన్న ఎంపికలే భవిష్యత్తులో మన స్థాయిని నిర్ణయిస్తాయి. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. కష్టపడటం అంటే విశ్రాంతి లేకుండా పనిచేయడం కాదు. సరైన దిశలో, సరైన పద్ధతిలో, మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పనిచేయడం. కేవలం బిజీగా ఉండటం విజయానికి గుర్తు కాదు. మన సమయం, శక్తి ఏ దిశలో ఖర్చవుతున్నాయన్నదే ముఖ్యం. కాబట్టి మీ జీవితాన్ని మార్చుకోవడానికి రేపటి నుంచి ఏదో అద్భుతం జరగాలని చూడకండి. ఈరోజు నుంచే మంచి అలవాటును ప్రారంభించండి. నిర్ణయించుకున్న పనిని పూర్తి చేయండి. సమయాన్ని గౌరవించండి. నిన్నటి మీకంటే ఈరోజు మీరు కొంచెం మెరుగ్గా ఉండటానికి ప్రయత్నించండి.

గుర్తుంచుకోండి.. విజేతలను ప్రత్యేకంగా నిలబెట్టేది వాళ్లకు మాత్రమే ఉన్న ప్రతిభ కాదు. అందరికీ అందుబాటులో ఉన్న సాధారణ లక్షణాలను వాళ్లు అసాధారణమైన స్థాయిలో ఆచరించడమే! ప్రతిభ మీకు ఒక అవకాశాన్ని ఇవ్వవచ్చు. కానీ నిలకడ, పట్టుదల, నిరంతర శ్రమ మాత్రమే ఆ అవకాశాన్ని విజయంగా మారుస్తాయి.

అగ్నివీరులకు బిగ్ ఛాన్స్!


నాలుగేళ్ల క్రితం తెచ్చిన అగ్నిపథ్ పథకంలో కేంద్రం కీలక మలుపు తీసుకుంది. నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్ల సేవ, ఆపై శాశ్వత సైనికులయ్యే అవకాశమిచ్చింది. యువతకు ఊరట దక్కినా, పెరిగే జీతాలు, పెన్షన్ల భారాన్ని ఎలా అదుపు చేస్తారన్న ప్రశ్న మిగిలే ఉంది. సైనిక సంస్కరణ ఎన్నికల రాజకీయాలకు బందీ కాకుండా, యువత భద్రత, సైన్య సామర్థ్యం, ఖజానా నిలకడల మధ్య సమతుల్యం సాధించాలి.



నాలుగేళ్ల క్రితం తెచ్చిన అగ్నిపథ్ పథకంలో కేంద్రం కీలక మార్పులు చేసింది. నవంబర్ 4న కేంద్ర మంత్రివర్గం, త్రివిధ దళాల సిఫార్సుల ఆధారంగా, నాలుగేళ్ల సేవ తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్ల సేవా కాలాన్నిచ్చింది. ఆ రెండేళ్లు పూర్తయ్యాక అందరినీ రెగ్యులర్ సైనికులుగా చేర్చుకునే మార్గాన్ని తెరిచింది, అయితే వారి ఇష్టం, ఎంపిక ప్రమాణాల ఆధారంగా. మొదటి నాలుగేళ్ల తర్వాత మెరిట్ ఆధారంగా 25 శాతం మందిని రెగ్యులర్ సైనికులుగా తీసుకునే పద్ధతి కొనసాగుతుంది; వారు రెండేళ్ల తర్వాత చేరేవారికంటే సీనియర్లుగా ఉంటారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రెండేళ్లను "సెకండ్ టూర్ ఆఫ్ డ్యూటీ"గా వర్ణిస్తూ, ఇది "యువ, ఫిట్, సాంకేతికంగా సిద్ధమైన, భవిష్యత్తుకు సన్నద్ధమైన సైన్యం" కోసం చేస్తున్న దీర్ఘకాల నిర్మాణ సంస్కరణల్లో భాగమన్నారు. రెండో సేవా కాలంలో ఎక్కువ జీతం, మెరుగైన సేవా నిధి, సీనియారిటీ ప్రయోజనాలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం సమయం గమనార్హం: మొదటి బ్యాచ్‌కు చెందిన సుమారు 18,300 మంది అగ్నివీరులు డిసెంబర్ 31నాటికి నాలుగేళ్ల సేవ పూర్తి చేసుకుని బయటకు వెళ్లాల్సి ఉండగా, కేవలం మూడు వారాల ముందు ఈ మార్పు వచ్చింది. పైగా వచ్చే ఏడాదిలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి; ఈ రాష్ట్రాల యువతకు సైన్యంలో ఉద్యోగం కుటుంబ సంప్రదాయం, సామాజిక పురోగతికి మార్గం. కాంగ్రెస్ దీన్ని "యూ-టర్న్" అని విమర్శించింది; పథకాన్ని మొదటి నుంచీ రాహుల్ గాంధీ వ్యతిరేకించారని, ఆయన లేవనెత్తిన ఆందోళనలనే ప్రభుత్వం ఇప్పుడు గుర్తించిందని వాదించింది. ఏమైనా, ప్రభుత్వం తాను తెచ్చిన విధానాన్నే వెనక్కి తీసుకుని, అందరు అగ్నివీరులకు శాశ్వత సైనికులయ్యే మార్గాన్ని సృష్టించింది.

అసలు అగ్నిపథ్ ఎందుకు వచ్చింది? 2022 జూన్‌లో ప్రకటించిన ఈ పథకం ప్రకారం 17.5 నుంచి 21 ఏళ్ల యువతను నాలుగేళ్లకు సైన్యంలోకి తీసుకుంటారు. అందులో 25 శాతం మందికే శాశ్వత సేవ, మిగతా 75 శాతం మందికి పన్ను లేని సుమారు రూ.11.71 లక్షల 'సేవా నిధి' ఇచ్చి పంపేస్తారు; వారికి గ్రాట్యుటీ, పెన్షన్ ఉండవు. సైనికుల సగటు వయసును తగ్గించాలని కార్గిల్ సమీక్ష కమిటీ రెండు దశాబ్దాల క్రితమే సిఫార్సు చేసింది. సిబ్బంది భారాన్ని తగ్గించి, ఆధునికీకరణకు నిధులు విడుదల చేయడం ఈ పథకం లక్ష్యం. 2014-15 నుంచి 'ఒక ర్యాంకు, ఒక పెన్షన్' (ఓఆర్ఓపీ) అమలైన తర్వాత సైనిక జీతాలు, పెన్షన్లు విపరీతంగా పెరిగాయి; రక్షణ బడ్జెట్‌లో సగానికి పైగా వాటికే పోతోందని రక్షణ విశ్లేషకుల అంచనా. ఇది ఎంతోకాలం నిలిచే పరిస్థితి కాదు. చైనా కూడా తన పీఎల్ఏ సైన్యం పరిమాణాన్ని 23 లక్షల నుంచి 20 లక్షలకు తగ్గించింది; చురుకైన, సాంకేతికంగా నైపుణ్యం గల, మరింత సమైక్యమైన సైన్యమే దాని లక్ష్యం. కాబట్టి అలాంటి పునర్వ్యవస్థీకరణకు భారత్ ప్రయత్నించడం స్వాగతించదగ్గదే. కానీ అగ్నిపథ్ ఆలోచన భారత వాస్తవికతలను దాటాల్సి వచ్చింది. మొదటిది, చాలామంది గ్రామీణ యువతకు శాశ్వత సైనిక ఉద్యోగం కుటుంబ సంప్రదాయం, సామాజిక ఎదుగుదలకు దారి. నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లే 75 శాతం మందికి వారి అనుభవానికి తగిన మంచి పౌర ఉద్యోగాలు దొరికితేనే మొదటి పథకం పనిచేసేది; కానీ అలాంటి అవకాశాలు అనుకున్నంతగా రాలేదన్న అభిప్రాయం బలంగా ఉంది. రెండవది, సైన్యంలోనే ఆందోళనలున్నాయి. ఆధునిక యుద్ధానికి సైనికులను పూర్తిగా సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం పడుతుంది, కాబట్టి నాలుగేళ్లకే చాలామందిని పంపేయడం అంతరాయం కలిగిస్తుంది. పైగా అగ్నివీరులు, శాశ్వత సైనికులు ఒకే యూనిట్లలో ఒకే పనులు చేస్తున్నా, వారి ప్రయోజనాల్లో భారీ తేడా ఉండటంతో సమైక్యత దెబ్బతింటుందన్న భయం ఉంది. మూడవది, శిక్షణ పొంది బయటకు వచ్చిన యువకులను సంఘ వ్యతిరేక శక్తులు లేదా కిరాయి సైనిక గుంపులు ఆకర్షించవచ్చన్న ఆందోళన. ఈ నేపథ్యంలో 75 శాతం మందికి మరో రెండేళ్ల సేవ, ఆ తర్వాత శాశ్వత నియామకం అనే కొత్త నిర్ణయం, ఈ ఆందోళనల్లో చాలా వాటిని పరిష్కరిస్తుంది.

అయితే ప్రాథమిక సమస్య ఇంకా మిగిలే ఉంది: పెరిగిపోతున్న జీతాలు, పెన్షన్ల భారం. చివరికి అందరినీ శాశ్వత సైనికులను చేస్తే, పథకం అసలు ఉద్దేశం పలుచబడి పాత పద్ధతికి దగ్గరగా వెళ్లే ప్రమాదముంది. రెండు సరిహద్దుల్లో శత్రు సవాళ్లను ఎదుర్కొంటున్న సైన్యానికి ఖర్చుల భారం, ఆధునికీకరణ లోటు ఒకేసారి భారమవుతాయి. కాబట్టి ఏటా తీసుకునే సైనికుల సంఖ్యను ఒకేసారి కాకపోయినా, ఉదాహరణకు ఐదేళ్లలో క్రమంగా తగ్గించవచ్చా అన్నది ఆలోచించదగ్గ ప్రశ్న. దీనికి శాశ్వత పరిష్కారం ఒక్కటే: అర్ధ-నైపుణ్యం గల యువతకు తగిన జీతాలు ఇచ్చే పౌర ఉద్యోగాలు తగినన్ని ఉండటం, అప్పుడు సమస్యే ఉండదు. కానీ అదే భారత్‌కు అతిపెద్ద సవాలు, దానికి పరిష్కారం ఇంకా కనిపించడం లేదు. కొత్త ఏర్పాటులో కొన్ని ప్రశ్నలు కూడా ఉన్నాయి. "ఇష్టం, ఎంపిక ప్రమాణాల ఆధారంగా" అనే షరతు ఆచరణలో ఎంత కఠినంగా అమలవుతుంది? రెండేళ్ల తర్వాత కూడా ఎంపిక కాని వారికి భవిష్యత్తు ఏమిటి? మొదటి 25 శాతం, తర్వాత చేరే 75 శాతం మధ్య సీనియారిటీ తేడాలు యూనిట్లలో కొత్త అసంతృప్తికి దారి తీయవా? ఇక్కడ ప్రభుత్వం కొన్ని విషయాలు స్పష్టం చేయాలి: పథకం కొనసాగుతుందని చెబుతున్నారు, అలాంటప్పుడు కొత్త ఏర్పాటు వల్ల బడ్జెట్‌పై నిజమైన ప్రభావం ఎంత, ఎంతమంది చివరికి శాశ్వత సైనికులవుతారు, సైన్యం యువతకు, అనుభవానికి మధ్య సమతుల్యాన్ని ఎలా సాధిస్తుంది? ఈ లెక్కలను పార్లమెంటుకు, ప్రజలకు ముందుగానే చెప్పాలి. అలాగే అగ్నివీరులకు ఆ రెండేళ్లలో స్పష్టమైన శిక్షణ, నైపుణ్య ధృవీకరణలు ఇవ్వడం, సేవా కాలం పూర్తయ్యాక ఉద్యోగాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరం. సైనిక సంస్కరణ ఎన్నికల రాజకీయాలకు బందీ కాకూడదు: యువతకు భద్రత, సైన్యానికి సామర్థ్యం, ఖజానాకు నిలకడ, ఈ మూడింటినీ సమతుల్యం చేసేలా సంస్కరణ కొనసాగాలి. ■




మీ జీవితంలోని ప్రతి వయసును, మార్పును, అనుభవాలను దగ్గరగా చూసే ఏకైక సాక్షి మీరే! మీ తల్లిదండ్రులకు మీ వృద్ధాప్యం తెలియదు. మీ జీవిత భాగస్వామికి మీ బాల్యం పరిచయముండదు. మీ పిల్లలకు మీ యవ్వనం తెలీదు. కానీ బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు మీ ప్రతి రూపంతో ప్రయాణించేది మీరొక్కరే. అందుకే ఇతరుల ప్రేమ కోసం ఎదురుచూస్తూ మిమ్మల్ని మీరు నిర్లక్ష్యం చేసుకోకండి. మీకు మీరే విలువ ఇవ్వండి. మనస్ఫూర్తిగా ప్రేమించుకోండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. ఎందుకంటే మీ జీవిత ప్రయాణంలో చివరి వరకు మీతో ఉండాల్సిన వ్యక్తి మీరే!

-మహాదేవ

వింతల్లో వింతలు

ఐస్‌తో గేమ్. గిన్నిస్‌లో ప్లేస్!



సాధారణంగా ఐస్ ముక్కల్ని నోట్లో వేసుకుంటే చల్లగా ఉంటుంది. కానీ అమెరికాలోని ఇడాహోకు చెందిన డేవిడ్ రష్ మాత్రం వాటితోనే గిన్నిస్ రికార్డు సృష్టించాడు! రెండు ట్రేల మధ్య చేతులు ఉపయోగించకుండా కేవలం నోటితో ఐస్ ముక్కలను తరలించే సాహసం చేశాడు. అదీ కేవలం 30 సెకన్లలో ఏకంగా 991 గ్రాముల ఐస్‌ను తరలించాడు. ఒక్కో ముక్క బరువు 25 గ్రాములకు మించకూడదట. మరీ చల్లగా ఉంటే పెదాలకు అతుక్కుపోతాయట.. వేడిగా ఉంటే కరిగిపోతాయట! ఇప్పటికే 200కు పైగా గిన్నిస్ రికార్డులున్న ఈ ఘనుడికి.. ఐస్‌తోనూ చల్లటి రికార్డే సొంతమైంది!

నాలుగేళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు టీమిండియా!

జనవరి 2027లో భారత జట్టు పర్యటనకు సన్నాహాలు

- మూడు వన్డేలు, మూడు టీ20ల నిర్వహణకు ప్రతిపాదనలు
- రెండుసార్లు వాయిదా పడిన పర్యటనకు ఎట్టకేలకు కదలిక
- జింబాబ్వే సిరీస్ షెడ్యూల్ మారే అవకాశం
- ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ నేపథ్యంలో తేదీల సర్దుబాటు సవాల్
- కేంద్ర ప్రభుత్వ అనుమతుల తర్వాతే తుది నిర్ణయం



న్యూఢిల్లీ, నవంబర్ 6 (ఉద్యమ కెరటం): దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు వాయిదా పడిన టీమిండియా బంగ్లాదేశ్ పర్యటనను జనవరి 2027లో నిర్వహించేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లతో కూడిన ఆరు పరిమిత ఓవర్ల పోటీలను నిర్వహించాలని భావిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే భారత క్రికెట్ నియంత్రణ మండలి, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇప్పటివరకు ఈ పర్యటనపై అధికారిక ప్రకటన చేయలేదు. ఇరు బోర్డుల మధ్య చర్చలు చివరి దశకు చేరుకున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. భారత జట్టు చివరిసారిగా 2022 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో పర్యటించింది. ఆ సందర్భంగా ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు జరిగాయి. ఆ తర్వాత పలు కారణాలతో ద్వైపాక్షిక సిరీస్‌ల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. గతంలో నిర్ణయించిన పర్యటనలు రెండుసార్లు వాయిదా పడటంతో భారత జట్టు మళ్లీ బంగ్లాదేశ్ గడ్డపై ఎప్పుడు అడుగుపెడుతుందనే ప్రశ్న నెలకొంది. తాజాగా జనవరి 2027లో పర్యటన నిర్వహించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు వార్తలు రావడంతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ పర్యటనను భారత జట్టు ఇప్పటికే ప్రతిపాదించిన అంతర్జాతీయ మ్యాచ్‌ల కార్యక్రమంలో సర్దుబాటు చేయడం ప్రధాన సవాలుగా మారింది. జనవరి 3 నుంచి 9 వరకు జింబాబ్వేతో మూడు వన్డేల సిరీస్ నిర్వహించాల్సి ఉన్నట్లు సమాచారం. అనంతరం జనవరి 21 నుంచి ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానున్నట్లు పేర్కొంటున్నారు. ఈ రెండు సిరీస్‌ల మధ్య బంగ్లాదేశ్‌తో ఆరు మ్యాచ్‌లను నిర్వహించేందుకు తగిన సమయం లభిస్తుందా అనే అంశంపై బోర్డులు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ పర్యటనకు అవకాశం కల్పించేందుకు జింబాబ్వేతో జరగాల్సిన మూడు వన్డేల సిరీస్ తేదీలను మార్చే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక నిర్ణయం వెలువడలేదు. ఆస్ట్రేలియాతో కీలకమైన టెస్టు సిరీస్‌కు ముందు భారత ఆటగాళ్లకు తగిన విశ్రాంతి, సాధన సమయం అవసరమవుతుందని భావిస్తున్నారు. దీంతో ఆటగాళ్ల పనిభారం, ప్రయాణాలు, మ్యాచ్‌ల మధ్య విరామం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది కార్యక్రమాన్ని రూపొందించాల్సి ఉంది. మరోవైపు భారత్, బంగ్లాదేశ్ మధ్య ఇటీవల నెలకొన్న పరిణామాలు కూడా క్రికెట్ సంబంధాలపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో తలెత్తిన వివాదాలు, బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌కు సంబంధించిన పరిణామాలు ఇరు దేశాల క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఈ వివాదాల ప్రభావంతో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల్లో ప్రతిష్ఠంభన ఏర్పడినట్లు ప్రచారం జరిగింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాలు, క్రికెట్ బోర్డు నాయకత్వ మార్పుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత బోర్డుతో సంప్రదింపులు ముందుకు సాగుతున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ పరిణామాలపై ఇరు బోర్డుల నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. బంగ్లాదేశ్ పర్యటనను ఖరారు చేయడానికి ముందు బీసీసీఐ కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య సంబంధాలు, భద్రతా పరిస్థితులు, ఆటగాళ్ల ప్రయాణ ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. బోర్డుల మధ్య చర్చలు సానుకూలంగా ముగిసి, ప్రభుత్వ అనుమతులు లభిస్తే జనవరి 2027లో భారత జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించే అవకాశం ఉంది. అదే జరిగితే 2022 డిసెంబర్ తర్వాత దాదాపు నాలుగేళ్ల విరామానికి తెరపడినట్లవుతుంది. అయితే అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ పర్యటనను ప్రతిపాదనగానే పరిగణించాల్సి ఉంటుంది.



ప్రధాని మోదీని కలిసిన సూర్యకుమార్ యాదవ్

సతీసమేతంగా ప్రధానితో ప్రత్యేక భేటీ

ప్రపంచకప్ స్వర్ణ పతకంతో సందడి చేసిన క్రికెటర్

న్యూఢిల్లీ, నవంబర్ 6 (ఉద్యమ కెరటం): భారత టీ20 క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో తన భార్య దేవీశా శెట్టితో కలిసి ప్రధానిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ యాదవ్ దంపతులు ప్రధానితో కొంతసేపు ముచ్చటించారు. 2026 టీ20 ప్రపంచకప్ విజేతగా అందుకున్న స్వర్ణ పతకాన్ని సూర్యకుమార్ మెడలో ధరించి కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీలో సూర్యకుమార్ దంపతులతోపాటు ఓ చిన్నారి కూడా పాల్గొంది. ఆ బాలిక కన్నడ భాషలో వినాయకుడి భక్తి కీర్తనలను ఆలపించి ప్రధాని మోదీని ఆకట్టుకుంది. చిన్నారి పాటను ప్రధాని ఆసక్తిగా విన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రధాని తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో ఆసక్తిని రేకెత్తించింది. మరోవైపు దీపావళి పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ప్రధాని మోదీ శ్రీరాముడి అయోధ్య రాకను ప్రస్తావించారు. పద్నాలుగేళ్ల వనవాసం అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని దీపావళి వేడుకలు నిర్వహించుకునే సంప్రదాయాన్ని గుర్తుచేశారు. దీపాల వెలుగులతో అయోధ్య నగరం, సరయూ నదీ తీరం దివ్యంగా ప్రకాశించాయని పేర్కొన్నారు. ఆ శుభప్రదమైన క్షణాలు దీపావళి వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చాయని వివరించారు. ప్రధానితో సూర్యకుమార్ యాదవ్ దంపతుల భేటీ, చిన్నారి ఆలపించిన భక్తి గీతాలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

'పాన్ ఇండియా' ఎవరు మొదలు పెట్టారు?
'కింగ్ నాగార్జున'పై సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు









స్టైలిష్ బ్లూ డెనిమ్ జంప్‌సూట్‌లో మెరిసిపోయిన ఐషా శర్మ - ఫోటోషూట్

నేటి సినీ పరిశ్రమలో -పాన్-ఇండియా- అనే పదం ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రతీ ఒక్కరూ బహు భాషలలో సినిమాలు చేస్తూ సరిహద్దులు చెరిపేస్తున్న వేళ.. ఈ ట్రెండ్‌ను దశాబ్దాల క్రితమే ప్రారంభించిన మార్గదర్శి గురించి కోలీవుడ్ స్టార్ హీరో సూర్య చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తించాయి. అసలు పాన్ ఇండియా సినిమాని సౌత్ లో ప్రారంభించింది ఎవరో సూర్య క్లారిటీ గా చెప్పారు.టాలీవుడ్ సీనియర్ హీరో -నాగ్ సర్- దీనికి ఆద్యుడు అని సూర్య వ్యాఖ్యానించారు. తన కొత్త చిత్రం -సీన్- ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న సూర్య నేరుగా నాగార్జునపై ప్రశంసల జల్లు కురిపించారు. నాగ్ సర్ ఇతర భాషల దర్శకులతో పని చేయడమే కాకుండా..స్వయంగా పోరుగు పరిశ్రమలలో నటిస్తూ పాన్ ఇండియా ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారని కీర్తించారు.నాగార్జున పాన్-ఇండియా విజన్ గురించి సూర్య ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆసక్తికర అంశాలను వెల్లడించారు. నేడు ట్రెండ్‌గా మారిన పాన్-ఇండియా కాన్సెప్ట్‌ను నాగ్ సర్ ఎప్పుడో ముందే ఆచరణలో పెట్టారని అన్నారు. మణిరత్నం, ఫాజిల్, ప్రియదర్శన్ వంటి ఇతర భాషల దిగ్గజ దర్శకులతో కలిసి పనిచేస్తూ పోరుగు సినీ పరిశ్రమలను అనుసంధానించడంలో నాగార్జున ఎప్పుడూ ముందున్నారని చెప్పారు. మంచి సినిమాను, వైవిధ్యమైన కంటెంట్‌ను ఎల్లప్పుడూ ఆదరించే నాగ్ తత్వమే తనకు ప్రధాన స్ఫూర్తి అని సూర్య కొనియాడారు.అభిమానుల కోలాహలం మధ్య జరిగిన ఈ వేడుకలో సూర్య భావోద్వేగంతో మాట్లాడుతూ.. తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అభిమానులు చూపిస్తున్న అన్‌లిమిటెడ్ ప్రేమకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని.. --మనమంతా ఒకే కుటుంబం- అని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తమ పనులన్నీ పక్కన పెట్టి.. సభకు భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులకు, భద్రతా సిబ్బందికి .. మీడియా ప్రతినిధులకు సూర్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇక అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న -రోలెక్స్- సినిమా గురించి సూర్య ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. --స్క్రీన్ పై హీరోనా, విలనా? ఎవరు బెటర్ అంటే.. విలన్ పాత్రే చాలా బెటర్! ఇప్పటివరకు చాలా మంది హీరోలు వచ్చారు... ఇప్పుడు ఒక పవర్‌ఫుల్ విలన్ రావాల్సిన అవసరం ఉంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్‌ను నన్ను కలవమని చెప్పండి.. త్వరలోనే రోలెక్స్ ప్రాజెక్ట్‌ను మనం సాధ్యం చేద్దాం-- అంటూ సూర్య చేసిన వ్యాఖ్యలు ఫ్యాన్స్‌లో విపరీతమైన జోష్ నింపాయి.అలాగే తాను నటించిన -సీన్- చిత్రంలోని ఒక శక్తివంతమైన మెసేజ్ ని తన డైలాగుల్లో చెప్పారు.--ఐ యామ్ ది బెస్ట్.. ఐ కెన్ డు ఎనీథింగ్-- (నేనే బెస్ట్.. నేను ఏదైనా చేయగలను) అనే డైలాగ్ ఇతరులతో పోటీపడేందుకు కాదని.. మనపై మనకు నమ్మకం పెంచుకోవడానికేనని చెప్పారు. తాను కూడా ఒకప్పుడు ఎంతో సాధారణమైన ఇంట్రోవర్ట్ వ్యక్తిగా ఉండేవాడినని..తనకే ఇది సాధ్యమైనప్పుడు ప్రతి ఒక్కరూ సాధించగలరని భరోసా ఇచ్చారు. నాగార్జునపై సూర్య చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com